జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 44 | శనివారం 5 జూలై 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఖర్గే



**రోశయ్యకు ఘన నివాళులు**
**16సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన రోశయ్యకు అరుదైన రికార్డు**
**సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, (సందేశం టైమ్స్) : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శుక్రవారం ఆవిష్కరించారు. రోశయ్య జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, రోశయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మిగతా 2లో...



## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయండి : మల్లిఖార్జున ఖర్గే

హైదరాబాద్ (సందేశం టైమ్స్) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు గెలుచుకోవడంతో పాటు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సత్తా చాటాలని పార్టీ నేతలకు ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సమావేశం జరిగింది. దాదాపు 2 గంటల పాటు సాగిన ఈ సమావేశానికి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీఏసీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశం ప్రారంభానికి ముందు ఇటీవల సంగారెడ్డి జిల్లా పాశమైలారం

మిగతా 2లో...

## గ్రీన్ ట్రాన్స్‌ఫర్మేషన్ దిశగా అడుగులు వేస్తున్నాం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్:(సందేశం టైమ్స్) : గ్రీన్ టెక్నాలజీని ప్రోత్సహించేందుకు, గ్రీన్ ట్రాన్స్‌ఫర్మేషన్ దిశగా మోదీ ప్రభుత్వం అడుగులు వేస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఉద్ఘాటించారు. ఇందుకోసం కోల్ గ్యాసిఫికేషన్, రెన్యూవబుల్ ఎనర్జీ డైవర్సిఫికేషన్, పెద్దమొత్తంలో మొక్కల పెంపకం, తవ్వకం పూర్తయిన గనుల రీపర్పసింగ్ వంటివాటిపై మోదీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పుకొచ్చారు. ఇవాళ(శుక్రవారం) హైదరాబాద్‌లో అట్టహాసంగా వరల్డ్ మైనింగ్ కాంగ్రెస్ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సదస్సులో జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

మిగతా 2లో...



## ఈడీ విచారణకు సినీ నిర్మాత అల్లు అరవింద్

హైదరాబాద్, (సందేశం టైమ్స్) : ప్రముఖ నిర్మాత, గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్ ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు విచారించారు. హైదరాబాద్‌కు చెందిన రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ సంస్థకు సంబంధించిన రూ.101 కోట్ల బ్యాంక్ రుణ మోసం కేసులో ఆయనను సుమారు మూడు గంటల పాటు ప్రశ్నించి, వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు.



వివరాల్లోకి వెళితే, రామకృష్ణ ఎలక్ట్రానిక్స్, రామకృష్ణ టెలిట్రానిక్స్ సంస్థలు 2017-19 మధ్యకాలంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ.101 కోట్ల రుణం తీసుకుని ఎగవేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ రుణ నిధులను సంస్థ యజమానులు సొంత ప్రయోజనాలకు, అక్రమ నగదు బదిలీకి వాడారని ఈడీ గుర్తించింది. మొదట సీబీఐ కేసు నమోదు చేయగా, ఆ తర్వాత మనీ లాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు ప్రారంభించింది.


మిగతా 2లో...

## రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు ఒక రాజ్యాంగం.. కాంగ్రెస్‌కు ఒక రాజ్యాంగం ఉందా.. నిలదీసిన వై.సతీశ్ రెడ్డి



(సందేశం టైమ్స్) : తెలంగాణలో బీఆర్ఎస్‌కు ఒక రాజ్యాంగం.. కాంగ్రెస్, బీజేపీకి ఒక రాజ్యాంగం ఉందా అని రాష్ట్ర డీజీపీని రెడ్కో మాజీ చైర్మన్ వై.సతీశ్ రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ పుట్టిన రోజు ఒక్క రోజు కూడా ఫ్లెక్సీలను ఉంచకుండా తీసేసిన మున్సిపల్ అధికారులకు, పోలీసులకు.. నేడు ఏఐసీసీ ప్రెసిడెంట్ ఖర్గే కోసం కాంగ్రెస్ నాయకులు పెట్టిన ఫ్లెక్సీలు కనిపించడం లేదా అని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ప్రశ్నించారు. నాలుగు రోజుల నుంచి ఉన్న బీజేపీ ఫ్లెక్సీలు కనిపించడం లేదా అని నిలదీశారు.ట్రాఫిక్ సిగ్నల్ కనపడకుండా ఫ్లెక్సీలు పెడితే కూడా పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని వై.సతీశ్ రెడ్డి అన్నారు. దీన్ని బట్టి చూస్తే అధికార పార్టీ కోసమే అధికారులు పనిచేస్తున్నట్లు ఉందని తెలిపారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని, కలిసి పనిచేస్తున్నాయని చెప్పడానికి ఇదొక ఉదాహరణ అని పేర్కొన్నారు.

## నిరుద్యోగుల అరెస్ట్.. ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనం : హరీశ్‌రావు



హైదరాబాద్ (సందేశం టైమ్స్) : ప్రభుత్వ ఉద్యోగాల కోసం హాలో నిరుద్యోగి.. ఛలో సెక్రటేరియట్‌కు పిలుపు ఇచ్చిన విద్యార్థులు, నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులను ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం అప్రజాస్వామికం అని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రభుత్వ నిరంకుశత్వానికి ఇది నిదర్శనం అని ఆగ్రహం వ్యక్తం చేశారు.అరెస్టు చేసిన వారందరినీ తక్షణమే విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇస్తామన్న హామీని వెంటనే నిలుపుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## జేబులో పేలిన సెల్ ఫోన్.. వ్యక్తికి తీవ్ర గాయాలు..

(సందేశం టైమ్స్) : ఈ మధ్య కాలంలో సెల్‌ఫోన్ ప్రమాదాలు బాగా పెరిగిపోయాయి. తాజాగా, ఓ వ్యక్తి ప్యాంట్స్ జేబులో సెల్ ఫోన్ పేలింది. సెల్ ఫోన్ పేలుడు కారణంగా ఆ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడ్ని ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన హైదరాబాద్‌లోని రాజేంద్ర నగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. రాజేంద్ర నగర్‌కు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి పెయింటర్‌గా పని చేస్తున్నాడు. అతడు గత కొన్ని సంవత్సరాలుగా వీవో కంపెనీకి చెందిన ఫోన్ వాడుతున్నాడు. శుక్రవారం సెల్ ఫోన్‌ను ప్యాంట్స్ జేబులో పెట్టుకుని రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈ నేపథ్యంలో ఫోన్ ఒక్కసారిగా హీటెక్కింది. ఆ వెంటనే పేలిపోయింది. దీంతో శ్రీనివాస్ కాలికి తీవ్ర గాయాలు అయ్యాయి. నొప్పితో గిలగిల్లాడసాగాడు. ఇది గమనించిన స్థానికులు అతడికి సాయం చేయడానికి ముందుకు వచ్చారు. వెంటనే దగ్గరలోని




ఆస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు అతడికి చికిత్స చేస్తున్నారు.

# రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఖర్గే



లక్డీకాపూల్‌లో రోశయ్య విగ్రహం ఏర్పాటు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఎక్కువ సార్లు ఆర్థిక శాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా పదవులను అలంకరించిన కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహాన్ని లక్డీకాపూల్‌లో ఏర్పాటు చేశారు. లక్డీకాపూల్ లోని మెట్రో స్టేషన్ సమీపంలోని చౌరస్తాలో తొమ్మిది అడుగుల ఎత్తు, 450 కిలోల బరువుతో కాంస్య విగ్రహాన్ని నెలకొల్పారు. ఇవాళ రోశయ్య జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు.

అరుదైన రికార్డు సాధించిన రోశయ్య..

ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వంలో 16సార్లు ఆర్థికశాఖ మంత్రి హోదాలో రోశయ్య బడ్జెట్ ప్రవేశపెట్టి సరికొత్త రికార్డు సృష్టించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాజకీయాల్లో మచ్చలేని నాయకుడిగా ఎదిగారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. పదవులకే వన్నె తీసుకు వచ్చారన్నారు.

## గ్రీన్ ట్రాన్స్‌ఫర్మేషన్ దిశగా అడుగులు వేస్తున్నాం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న సుస్థిర మైనింగ్ పద్ధతులను తెలుసుకోవడంలో వరల్డ్ మైనింగ్ కాంగ్రెస్ సదస్సు చాలా కీలకమని కిషన్‌రెడ్డి వెల్లడించారు. మైనింగ్ రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం చాలా అవసరమని వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్రప్రభుత్వం ఈ దిశగా కీలక నిర్ణయాలు తీసుకుందని ఉద్ఘాటించారు. బొగ్గు, గనుల రంగం ఆత్మనిర్భరత సాధించాలంటే ప్రపంచస్థాయి ఆలోచనల అమలు అవసరమని చెప్పుకొచ్చారు. ప్రకృతిని, ప్రజలను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లే సుస్థిర మైనింగ్ సాధ్యమని తెలిపారు. బొగ్గు, ఇతర మినరల్స్ ఉత్పత్తి, ప్రజాసంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, సాంకేతికతకు ప్రోత్సాహం అందించడం మోదీ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని ఉద్ఘాటించారు కిషన్‌రెడ్డి. ఉత్పత్తి చేయడం ఎంత ముఖ్యమో.. బాధ్యతాయుతంగా మైన్ క్లోజర్‌పై దృష్టిపెట్టడం కూడా చాలా కీలకమని కిషన్‌రెడ్డి చెప్పుకొచ్చారు. ఇందుకోసం సింగిల్ విండో సిస్టం తీసుకొచ్చామని అన్నారు. ఇందుకోసం త్వరగా అనుమతులను మంజూరు చేస్తున్నామని చెప్పారు. గనుల కోసం భూములు ఇస్తున్న వారికి అవసరమైన ఉపాధి అవకాశాలు కల్పించడం, వారి జీవన ప్రమాణాలను పెంచేందుకు మోదీ సర్కార్ కృషిచేస్తోందని చెప్పుకొచ్చారు. ఇన్సెంటివ్స్ ఇస్తున్నాం, పరిశోధనలకు, అధునాతన సాంకేతికతను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్ ద్వారా ఎక్స్‌ప్లోరేషన్‌ను మరింతగా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రైవేట్ సంస్థలను కూడా ఎక్స్‌ప్లోరేషన్ చేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయండి : మల్లిఖార్జున ఖర్గే

పారిశ్రామికవాడలోని సిగాచి పరిశ్రమ పేలుడు ఘటనలో మృతులకు సంతాపం తెలుపుతూ మౌనం పాటించారు. అనంతరం ఖర్గే మాట్లాడుతూ నేతల మధ్య విభేదాలుంటే పార్టీలోని చర్చించుకోవాలని బయట మాట్లాడవద్దని హెచ్చరించారు. ప్రతిపక్ష పార్టీలకు అవకాశం ఇవ్వవద్దని సమస్యలుంటే ఇన్‌చార్జి నేతలతో కో ఆర్డినేట్ చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఇక స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పార్టీ సంస్థాగత నిర్మాణం, జిల్లాల్లో జరుగుతున్న పార్టీ కార్యక్రమాలు, జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాలు, సంవిధన్ బచావో కార్యాచరణ ప్రణాళికపై ఈ సమావేశంలో చర్చించారు.

ఖర్గేతో బీసీ నేతల భేటీ:

గాంధీ భవన్ కు వచ్చిన మల్లికార్జున ఖర్గేతో బీసీ సంఘాల నేతలు (%దీజ బఆఱశీఱ శ్రీముంవతీం%) భేటీ అయ్యారు. బీసీ నేత జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో ఖర్గేను కలిసిన బీసీ నేతలు త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు, జాతీయస్థాయిలో కులగణన అంశాలు, ఢిల్లీకి అఖిలపక్షం తదితర బీసీ డిమాండ్లను ఖర్గే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు మల్లికార్జున ఖర్గేకు వినతిపత్రం అందజేశారు.


## ఈడీ విచారణకు సినీ నిర్మాత అల్లు అరవింద్

ఈ దర్యాప్తులో భాగంగా రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ సంస్థతో అల్లు అరవింద్‌కు చెందిన సంస్థలకు మధ్య కొన్ని అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. ఈ లావాదేవీలపై స్పష్టత కోరుతూ అధికారులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయానికి హాజరైన అల్లు అరవింద్‌ను అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. ప్రధానంగా బ్యాంకు లావాదేవీలు, ఆస్తుల కొనుగోళ్లకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.

విచారణ ఇంకా పూర్తికానందున, వచ్చే వారం మరోసారి తమ ఎదుట హాజరుకావాలని ఈడీ అధికారులు ఆయనకు సూచించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న రామకృష్ణ గ్రూప్ యజమానులు వి. రాఘవేంద్ర, వి. రవి కుమార్‌లతో అల్లు అరవింద్‌కు ఉన్న సంబంధాలపై కూడా ఈడీ ఆరా తీస్తోంది.

# బీజేపీ నేత ఇంటి ముందు రోహింగ్యాల రెక్కీ

రంగారెడ్డి జిల్లా: మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ ఇంటి ముందు ఇవాళ(శుక్రవారం) రోహింగ్యాలు రెక్కీ నిర్వహించారు. శ్రీరాములు ఇంటి ముందు అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆరుగురు వ్యక్తులను బీజేపీ కార్యకర్తలు, నేతలు గుర్తించారు. వారి వద్ద పెట్రోల్ బాటిల్, సుత్తి, కట్టర్, ఐరన్ రాడ్స్, బాక్స్‌లో పెట్టుకుని రోహింగ్యాలు తిరుగుతున్నారు. గత కొన్ని రోజులుగా రోహింగ్యాలపై శ్రీరాములు ఉద్యమం చేస్తున్నారు. అందెల శ్రీరాములుకు ప్రాణహాని ఉందని బీజేపీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ నేతలు రోహింగ్యాలను పట్టుకోడానికి ప్రయత్నించగా బండి వదిలి పారిపోయారు. ఐదుగురు వ్యక్తులను గుర్తించి మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పోలీసులకు బీజేపీ నేతలు సమాచారం ఇచ్చారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని మీర్‌పేట పోలీసులు విచారిస్తున్నారు.




రోహింగ్యాలు ఎక్కడి నుంచి వచ్చారనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## గాంధీభవన్‌కు కేడర్.. అడ్డుకున్న పోలీసులు.. రేణుకా చౌదరి ఫైర్

హైదరాబాద్, జులై 4: గాంధీభవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ పీఏసీ సమావేశం కొనసాగుతోంది. ఏఐసీసీ చీఫ్ ఖర్గే, కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు సమావేశానికి హాజరయ్యారు. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ అగ్రనేతలు గాంధీ భవన్‌లో ఉండటంతో వారిని కలిసేందుకు కేడర్ క్యూ కట్టింది. ఈ క్రమంలో కేడర్ లోపలికి రాకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. అడ్డుకున్న వారిలో రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి స్టాఫ్ ఉన్నారు. దీంతో ఆమె స్వయంగా పోలీసుల వద్దకు వచ్చి స్టాఫ్‌ను లోపలికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో పోలీసుల తీరుపై రాజ్యసభ సభ్యురాలు అసంతృప్తి వ్యక్తం చేశారు. తమకంటే పోలీసుల హడావుడి ఎక్కువైందంటూ రేణుకా చౌదరి మండిపడ్డారు. మరోవైపు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అసహనం వ్యక్తం చేశారు. తమను ఆపుతారా అంటూ పోలీసులపై నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు పీఏసీ సమావేశంలో పార్టీ నేతలకు ఖర్గే దిశానిర్దేశం చేశారు. సమావేశం మొదలైన వెంటనే పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటనలో చనిపోయిన మృతులకు సంతాపం తెలుపుతూ పీఏసీ సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఆపై ఎజెండా ప్రకారం పీఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలు



చర్చకు వచ్చాయి. పార్టీ బలోపేతం, ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి ఎంత మేరకు తీసుకెళ్లారనే దానిపై చర్చించారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీలోకి చేరికలను ప్రోత్సహించాలని మల్లికార్జున ఖర్గే తెలిపారు. రాష్ట్రంలో జై భీమ్ జై బాపు జై సంవిధాన్ వంటి కార్యక్రమాలు ఎలా కొనసాగుతున్నాయనే దానిపై రిపోర్టును పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సమావేశంలో చదివి వినిపించారు. గ్రేటర్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ తీసుకోవాల్సిన నిర్ణయాలు, అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ జరిగింది. అలాగే జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అంశంపై కూడా పీఏసీలో చర్చ జరిగింది.

## ఆగస్టు 13న దివ్యాంగుల మహాగర్జన



హైదరాబాద్: కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం దివ్యాంగుల పెన్షన్ రూ. 6 వేలు, ఆసరా పెన్షన్ రూ.4 వేలు, తీవ్ర వైకల్యం గల వారికి రూ. 15 వేలు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆగస్టు 13న దివ్యాంగులు, ఆసరా పెన్షన్ దారుల మహాగర్జన నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎల్బీ స్టేడియంలో మహాగర్జన నిర్వహిస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్ల ప్రకటిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్ పదవుల్లోనూ దివ్యాంగులకు ప్రాధాన్యం కల్పించాలన్నారు.

## కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రెస్‌మీట్ పెడతా

రైతు సమస్యలు, బనకచర్లపై వివరిస్తా

ఒకట్రెండు రోజుల్లో ఆస్పత్రి నుంచి బయటకొస్తా.. పార్టీ నాయకులతో కేసీఆర్

ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడించిన యశోద ఆస్పత్రి వర్గాలు



హైదరాబాద్, జూలై 4: ఒకటి, రెండు రోజుల్లో ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అవుతానని, రాష్ట్రంలో నెలకొన్న సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రెస్‌మీట్ పెడతానని బీఆర్ఎస్ నేతలతో ఆ పార్టీ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగం సమస్యలు, ఏపీలో బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం జరిగితే రాష్ట్రానికి కలిగే నష్టం సహా అనేక అంశాలను మీడియా ముఖంగా ప్రజలకు వివరిస్తానని చెప్పినట్లు తెలిసింది. సాధారణ వైద్య పరీక్షల నిమిత్తం యశోద ఆస్పత్రిలో చేరిన కేసీఆర్‌ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాసయాదవ్, ఇతర ముఖ్యనేతలు పరామర్శించారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, రైతులకు యూరియా, ఎరువుల లభ్యత, వ్యవసాయం, సాగునీరు వంటి ప్రజా సమస్యలు, తాజా రాజకీయ పరిణామాలు, ఇతర అంశాలపై వారితో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. కాగా, కేసీఆర్ ఆరోగ్య సమాచారం అడుగుతూ ఆయన క్షేమంగా ఉండాలని కోరుకుంటున్న వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఎక్స్ వేదికగా కేటీఆర్ పేర్కొన్నారు. బ్లడ్ షుగర్, సోడియం స్థాయిల పర్యవేక్షణ కోసం ఒకటి, రెండు రోజులు ఆస్పత్రిలో ఉండాలని వైద్యులు సూచించినట్లు తెలిపారు. మరోవైపు.. కేసీఆర్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు యశోద ఆస్పత్రి వైద్య వర్గాలు తెలిపాయి.

కేసీఆర్‌ను పరామర్శించిన కవిత

యశోద ఆసుపత్రిలో చేరిన కేసీఆర్‌ను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పరామర్శించారు. శుక్రవారం తెల్లవారు జామున ఒకసారి, ఆ తర్వాత మరోసారి ఆమె ఆస్పత్రికి వెళ్లి తండ్రి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

# పోయిన ఫోన్‌ను పట్టేద్దాం..





కరీంనగం(సందేశం టైమ్స్)జులై 4: : నేటి ఆధునిక యుగంలో సెల్‌ఫోన్ కీలకమైంది. 90 శాతం కొనుగోళ్లు ఆన్‌లైన్ ద్వారానే జరుగుతున్నాయి. అన్ని రకాల చెల్లింపులకు ఫోనే ఆధారంగా మారింది. ఫోన్ ఎక్కడైనా పోతే, ఎవరైనా దొంగిలిస్తే ఆ ఫోన్‌లో భద్రపరిచిన విలువైన వ్యక్తిగత సమాచారం, ఇతర డేటా కోసం తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. గతంలో సెల్‌ఫోన్ పోతే.. దాన్ని తిరిగి పొందేందుకు పోలీసులకు, మీసేవలో దరఖాస్తు చేసేందుకు ఇబ్బందులు పడుతుండేవారు. అయినప్పటికీ ఆ ఫోన్ లభిస్తుందో లేదో గ్యారంటీ లేకపోయేది. 2023 ఏప్రిల్ నుంచి కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీఈఐఆర్ ప్రత్యేక అప్లికేషన్ ద్వారా సెల్‌ఫోన్ ఎక్కడ ఉందో సులభంగా గుర్తించవచ్చు. ఈ పోర్టల్ ద్వారా కరీంనగర్ కమిషనరేట్‌లో ఇప్పటి వరకు వెయ్యి వరకు సెల్‌ఫోన్‌లను పోలీసులు వెతికిపట్టుకుని యజమానులకు అప్పగించారు. పోగొట్టుకున్న, చోరీ అయిన వేల సెల్‌ఫోన్లను ఈ పోర్టల్ ద్వారా పోలీసులు బ్లాక్ చేశారు.

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి



(సందేశం టైమ్స్)జులై 4: ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ గ్రామంలోని తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి నదీం అహ్మద్‌తో కలిసి వంటశాల, నిత్యావసర సరుకుల నాణ్యత, బియ్యం నిల్వలు, వండిన ఆహారాన్ని, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, వంట సరుకులను క్రమపద్ధతిలో అమర్చుకొని వంటలు వినియోగించాలని తెలిపారు. ప్రతిరోజు మెనూ ప్రకారం విద్యార్థినులకు పోషకాహారం అందించాలని, విద్యార్థినులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. గురుకుల పాఠశాల భవనం, ఆవరణ పరిశుభ్రంగా ఉండే విధంగా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. తరగతిలో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. అనంతరం ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులతో కలిసి వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పాఠశాల ఆవరణలోని ఖాళీస్థలాల్లో పండ్ల మొక్కలు, పూల మొక్కలు నాటి సంరక్షించాలని, బెండకాయ, వంకాయ, బీరకాయ, టమాట ఇతర మొక్కలు నాటాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

# ప్రకృతి ఒడిలో.. పెళ్లి పందిరి



కొల్లాపూర్,(సందేశం టైమ్స్)జులై 4: : నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో సోమశిల కూడా ఒకటి. ఒకవైపు రెండు కొండల నడుమ పరవళ్లు తొక్కే కృష్ణానది, మరో వైపు ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లే లలితాంబికా సోమేశ్వరాలయం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. తాజాగా డెస్టినేషన్ వెడ్డింగ్‌ల కోసం అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేయడంతో సోమశిల ప్రాంతం కొత్త సొబగులను సంతరించుకోనున్నది. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అందుకు అవసరమయ్యేన అన్ని సదుపాయాలు కల్పించనున్నది. కృష్ణానది తీరాన ఆధునిక, విలాసవంతమైన భవనాలను నిర్మించనున్నారు.

అతిథులకు అవసరమైన గెస్ట్‌హౌస్‌లు, సదస్సుల నిర్వహణ కోసం కాన్ఫరెన్స్ హాళ్లు, ఫొటో, వీడియో షెస్ల కోసం ఉద్యానవనాలు, సెల్ఫీపాయింట్లు, చిన్నారులు ఆడుకునేందుకు అవసరమైన ఉయ్యాలలు, జారుడు బల్లలు తదితర సౌకర్యాలు కల్పించనున్నారు. దీంతో దేశవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన వెడ్డింగ్ డెస్టినేషన్ కేంద్రాలు జైపూర్, రాజస్థాన్, ఉదయ్‌పూర్, గోవా, ఊటీ, కేరళ తదితర ప్రాంతాల సరసన మన సోమశిల కూడా చేరబోతున్నది.

రాష్ట్రంలో నాలుగు ప్రాంతాలు

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పర్యాటక పాలసీ మేరకు వెడ్డింగ్ డెస్టినేషన్‌ను అభివృద్ధి చేసేందుకు రాష్ట్రంలో నాలుగు ప్రాంతాలను గుర్తించింది. హైదరాబాద్ నుంచి రాకపోకలకు సులువుగా ఉన్న ఆహ్లాదకర ప్రాంతాలకు ప్రాధాన్యం ఇచ్చింది. అందులో కామారెడ్డి జిల్లాలోని నిజాం సాగర్, యాదాద్రి భువనగిరి జిల్లాలోని బస్వాపూర్, నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్, బుద్ధవనం ప్రాజెక్టు, వీటితో పాటు సోమశిల ప్రాంతాల్లో వెడ్డింగ్ డెస్టినేషన్ అభివృద్ధి కోసం స్థలాలను గుర్తించారు. ఈ విషయంపై టూరిజం శాఖ అధికారులు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి చర్చించినట్లు తెలిసింది.

అందరికీ అందుబాటులో..

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలకు చెందిన సంపన్న కుటుంబాలు వివాహ వేడుకలను నిర్వహించుకునేందుకు రాజస్థాన్, జైపూర్, ఊటీ, కేరళ ప్రాంతాలను ఎంపిక చేసుకుంటున్నారు. అందుకోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. బంధు మిత్రులతో దూర ప్రాంతాలకు వెళ్లేందుకు వ్యయ ప్రయాసలకు గురవుతుంటారు. తాజాగా సోమశిల ప్రాంతాన్ని డెస్టినేషన్ వెడ్డింగ్‌ల కోసం అభివృద్ధి చేయనుండటంతో అందరికీ అందుబాటులోకి రానున్నది. అత్యంత ఆర్భాటంగా పెళ్లిళ్లు, శుభకార్యాలు, విందులు, వినోదాలు నిర్వహించుకునేందుకు అవకాశం లభించనున్నది. దీంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి సభలు, సమావేశాలు, చర్చాగోష్టిలు, వర్క్‌షాపులు నిర్వహించుకునేందుకు వసతులను పర్యాటక శాఖ కల్పించనున్నది.

మరచిపోలేని అనుభూతి

వివాహాలను స్థానిక ఫంక్షన్ హాళ్లలో నిర్వహించుకోవడం సర్వసాధారణం. అలా కాకుండా దూర ప్రాంతాలకు వధూవరులు, వారి కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి వెళ్లి ఆధునిక వసతులు, ప్రకృతి అందాలు, రాజభవనాల్లో వివాహం చేసుకోవడాన్ని డెస్టినేషన్ వెడ్డింగ్ అంటారు. ఇలా పెళ్లి చేసుకోవడం వారికి మరచిపోలేని అనుభూతిని కలిగిస్తుంది.

# విచ్చలవిడిగా బ్లాక్ మార్కెట్ దందా..
# గుట్కా అమ్మకాల నియంత్రణపై నిఘా ఏది?



సారంగాపూర్,(సందేశం టైమ్స్),జులై 4: : నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలో గుట్కా వ్యాపారం జోరుగా సాగుతున్నది. పిల్లి గుడ్డిదైతే ఎలుక ఎగిరి మరీ ఎక్కిరిస్తుందన్న సామెతలా తయారైంది ఇప్పుడు అక్రమ గుట్కా వ్యాపారుల తీరు. గుట్కా అమ్మగాలపై నిషేధం ఉన్నప్పటికీ సంబంధిత శాఖల అధికారుల నిఘా లేకపోవడంతో మండలంలో విచ్చలవిడిగా గుట్కా అమ్మకాలు చేపడుతూ లక్షల రూపాయల సొమ్ము చేసుకుంటున్నారు. గుట్కా వ్యాపారులు అక్రమంగా అమ్మకాలు చేపట్టొద్దని సంబంధిత అధికారులు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ.. ఇటీవల కాలంలో దీనిపై అధికారులు ఎవరూ అజమాషి చేయకపోవడంతో అక్రమ వ్యాపారులు ఆడింది ఆట పాడిందే పాటగా వ్యాపారం గుట్టుగా కొనసాగుతుంది.

కిరాణా షాపుల్లో పుష్కలంగా గుట్కా అమ్మకాలు

మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోని కిరాణా షాపుల్లో, పాన్ షాపులలో నిషేధ గుట్కాలను పుష్కలంగా అమ్ముతున్నారు. అధికారులు ఎవ్వరు కిరాణా, పాన్ షాపులపై కన్నెత్తి కూడా చూడకపోవడంతో వారి వ్యాపారం మూడుపువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతోంది. ఈ గుట్కాలు అమ్ముతున్న వారు ఇతర రాష్ట్రాల నుండి ఎంతో గోప్యంగా తీసుకువచ్చి చిరు వ్యాపారులు, పాన్ షాప్ లకు అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. వీటిని కొనుగోలు చేస్తున్న పాన్ షాప్, చిల్లర దుకాణాల వ్యాపారులు వారు కొన్న ధరల కంటే రెండు రెట్లు లాభాన్ని చూసుకుని గుట్కా ప్రియులకు విక్రయిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

గుట్కాలు ఎక్కడి నుంచి వస్తున్నాయి?

ఈ నిషేధిత గుట్కాలు మండలానికి ఎక్కడి నుంచి సరఫరా అవుతున్నాయి అంటే చత్తీస్గడ్ నుండి మండలంలోని స్వర్ణ గ్రామానికి వస్తున్నాయనే వినికిడి వినిపిస్తోంది. అక్కడ నుంచి ప్రతినిత్యం అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. గుట్కా వ్యాపారం చేస్తున్న వ్యక్తి అధికార పార్టీ నాయకుడి అండదండలతో ఈ గుట్కా రవాణా చేస్తు ఎవరికి ఎటువంటి అనుమానం రాకుండా అక్రమ వ్యాపారం చేస్తున్నాడన్న ఆరోపణలు వున్నాయి. గుట్కా వ్యాపారం చేస్తున్న వ్యక్తి సంబంధిత శాఖ అధికారులకు ముడుపులు అందించడంతో సంబంధిత శాఖ అధికారులు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. మహారాష్ట్ర కూడా ప్రతినిత్యం వాహనాల్లో గుట్కాను అక్రమ వ్యాపారం చేస్తున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. స్వర్ణ గ్రామానికి కేంద్రంగానే గుట్కా దందా జోరుగా సాగుతుందని మండల వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుట్కా నిషేధాన్ని అరికట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

# సిగాచి ప్రమాద ఘటన..
# 39కి చేరిన మృతులు



సంగారెడ్డి,(సందేశం టైమ్స్)జులై 4: : సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి ఇండస్ట్రీస్ ప్రమాద ఘటనలో మృతుల సంఖ్య 39కి చేరింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ధ్రువ దవాఖానలో చికిత్స పొందుతున్న భీమ్‌రావు అనే వ్యక్తి శుక్రవారం ఉదయం మరణించారు. ఆయన స్వస్థలం మహారాష్ట్ర. ఈ మేరకు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారిక ప్రకటన చేశారు. ప్రమాదం నుంచి 61 మంది సురక్షితంగా బయటపడ్డారని చెప్పారు. ఇప్పటివరకు 31 మంది మృతదేహాలను గుర్తించామని, మరో ఏడుగురి మృతదేహాలను గుర్తించాల్సి ఉందని తెలిపారు. వివిధ హాస్పిటళ్లలో చికిత్స పొందుతున్నవారిలో 12 మంది డిశ్చార్జ్ అయ్యారని పేర్కొన్నారు. ప్రస్తుతం మరో 23 మంది చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. ఇంకా 9 మంది కార్మికుల ఆచూకీ లభించలేదన్నారు.మరోవైపు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నేతృత్వంలోని హైలెవల్ కమిటీ సిగాచీ పరిశ్రమకు చేరుకున్నది. పరిశ్రమలు, కార్మిక, అగ్నిమాపక, ఆరోగ్యశాఖ కార్యదర్శులకు కూడిన ఈ కమిటీ ప్రమాద స్థలాన్ని పరిశీలించింది. కాగా, గురువారం నిపుణుల కమిటీ ప్రమాద స్థలాన్ని పరిశీలించిన విషయం తెలిసిందే.

# కూలీ పంట పండింది.. విలువైన వజ్రం దొరికింది.. ధర ఎంతో తెలుసా..




కర్నూలు,(సందేశం టైమ్స్)జులై 4: : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉమ్మడి కర్నూలు జిల్లాలో వర్షాకాలం వచ్చిందంటే చాలు గ్రామస్తులు పొలాల్లోకి వెళ్లి వజ్రాల కోసం అన్వేషిస్తుంటారు. ప్రత్యేకంగా జొన్నగిరి, తుగ్గలి, ఎర్రగుడి, పగిడిరాయి లాంటి తదితర గ్రామాల్లోని ప్రజలు వజ్రాల కోసం పరుగులు తీస్తుంటారు. ఒక వజ్రం దొరికితే చాలు జీవితమే మారిపోతుందనే ఆశ వారిది. అందుకే అక్కడ ప్రజలు వర్షపు తొలకరి జల్లులు పడగానే పొలాలను జల్లెడ పడతారు. వజ్రాలు దొరికితే సాధారణ ప్రజలు గంటల వ్యవధిలో లక్షాధికారులు, కోటీశ్వరులు అయిపోతారు.ఒక వజ్రం దొరికితే చాలు తమ కష్టాలు అన్ని తీరుతాయని పొలాల్లో వేట కొనసాగిస్తారు. అక్కడి ప్రజలు మాత్రమే కాదు.. వజ్రాలు దొరికితే కొనుగోలు చేయడానికి వ్యాపారులు సైతం అక్కడ క్యూ కడుతుంటారు. ఆ ప్రాంత ప్రజలే కాదు పొరుగున ఉండే జిల్లాలు, ఇతర రాష్ట్రాల వారు సైతం ఉమ్మడి కర్నూలు జిల్లాకు వచ్చి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. ఒకవైపు రైతులు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉంటే.. వజ్రాల వేట కోసం మరోవైపు ప్రజలు గాలిస్తుంటారు.అయితే.. తాజాగా తుగ్గలి మండలంలోని పెండేకల్లు గ్రామానికి చెందిన రోజువారీ కూలీ ఓ రైతు పొలంలో పనిచేస్తున్నాడు. మట్టి పనులు చేస్తున్న సమయంలో భూమిలో తనకు మిల మిల మెరిసిపోతున్న వజ్రం కనిపించింది. మొదట ఆయన సాధారణంగా ఉన్న రాయి అని అనుకున్నాడు. ఆ తర్వాత స్థానికంగా ఉన్న వజ్రాల వ్యాపారి దగ్గరికి వచ్చి తనకు భూమిలో దొరికిన రాయిని చూపించాడు. అది రాయి కాదని అత్యంత విలువగల వజ్రమని వ్యాపారి చెప్పాడు. తనకు ఆ వజ్రం రూ.10 లక్షలకి అమ్మాలని వ్యాపారి కోరాడు. కానీ కూలీ మాత్రం ఆ వజ్రాన్ని అమ్మడానికి ఒప్పుకోలేదు. బహిరంగ మార్కెట్లో ఆ వజ్రానికి రూ. 50 లక్షల పైగానే పలుకుతుందని కూలీ ఊహించాడు. వ్యాపారి ఎంతగా ఒత్తిడి తెచ్చినా కూలీ మాత్రం ఆ వజ్రం అమ్మకూడదని నిర్ణయం తీసుకున్నాడు. అయితే కొద్దీ గంటల్లోనే వందలాది మంది ఆ వజ్రాన్ని చూడటానికి తరలి వచ్చారు. ఈ విషయం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# వీఎంఆర్‌డీఏ వేలం పాటల్లో బినామీలు



విశాఖపట్నం-(సందేశం టైమ్స్),జులై 4:
విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) నిబంధనలు అవకతవకలకు అవకాశం కల్పిస్తున్నాయి. లేఅవుట్లలో ప్లాట్లు, ఫ్లాట్లు, వాణిజ్య సముదాయాల్లో దుకాణాలను అప్‌సెట్ ధర నిర్ణయించి, ఆపై వేలం ద్వారానే కేటాయించాలనేది వీఎంఆర్‌డీఏ నిబంధన. అయితే అవసరం లేకున్నా కొందరు వేలంలో పాల్గొని వాటి రేట్లు పెంచేసి లబ్ధి పొందుతున్నారు. లేఅవుట్లలో అయితే రియల్ ఎస్టేట్ సంస్థల ఏజెంట్లు పాల్గొని ఒక ప్లాటు ధర అత్యధికంగా పాడేసి వదిలేస్తున్నారు. అదే ధరకు మిగిలిన ప్లాట్లు అమ్మడానికి వీఎంఆర్‌డీఏ యత్నిస్తోంది. ఆ ఏజెంట్లు అదే ప్రాంతంలో తమ లేఅవుట్లను వీఎంఆర్‌డీఏ కంటే తక్కువ రేట్లకు అమ్ముకొని లబ్ధి పొందుతున్నారు.

వాణిజ్య సముదాయాల్లో దుకాణాల వేలంలోను ఇటీవల ఇదే తరహాలో దందా మొదలైంది. ఎక్కడైనా డిమాండ్ కలిగిన ప్రాంతాల్లో వీఎంఆర్‌డీఏ దుకాణాలను వేలానికి పెడితే ఆ అవకాశం కోసమే ఎదురుచూస్తున్న కొందరు వారికి అవసరం లేకపోయినా దరఖాస్తు చేస్తున్నారు. వేలంలో పాల్గొంటున్నారు. పోటీ పడి అద్దె రేట్లు పెంచేస్తున్నారు. తాము వెనక్కి తగ్గాలంటే తగిన ప్రతిఫలం ఇవ్వాలని, ఆ దుకాణం కోసం పోటీ పడే వ్యాపారిని డిమాండ్ చేస్తున్నారు. దాంతో వారికి ఎంతో కొంత ఇచ్చి పోటీ నుంచి తప్పించాల్సి వస్తోంది. ఇదేక్రమంలో ఒక్కోసారి వారంతా రింగ్‌గా మారి వీఎంఆర్‌డీఏకు రావలసిన ఆదాయానికి కూడా గండి కొడుతున్నారు. తాజాగా ఇదే జరిగింది. రామ్‌నగర్‌లోని కొత్త వాణిజ్య సముదాయంలో ఖాళీగా ఉన్న దుకాణాలకు వీఎంఆర్‌డీఏ జూన్ నెలలో దరఖాస్తులు ఆహ్వానించింది. అందులో కొన్ని ఎస్సీ, ఎస్టీలకు కేటాయించింది. అద్దె మిగిలిన వారితో పోల్చుకుంటే తక్కువగా నిర్ణయించింది. అందులో గ్రౌండ్ ఫ్లోర్‌లో 5వ నంబరు దుకాణానికి వేలం నిర్వహించగా ఆరుగురు పాల్గొని రింగ్ అయిపోయి నెలకు రూ.14 వేలకే పాడుకున్నారు. అదే దుకాణానికి అంతకు ముందు నిర్వహించిన వేలంలో రూ.83 వేల అద్దె పలికింది. అయితే పాటదారుడు నిర్ణీత గడువులోగా చెల్లింపులు చేయకపోవడంతో అధికారులు స్వాధీనం చేసుకొని మళ్లీ పాట నిర్వహించారు. ఇలాంటి సమయాల్లో గతంలో వేలంలో ఎంత ధర పలికిందో అదే అప్‌సెట్ ధరగా నిర్ణయిస్తారు. కానీ ఇక్కడ ఆ దుకాణదారుడు అద్దెకు తీసుకోలేదు కాబట్టి దానిని పరిగణనలోకి తీసుకోలేదని అధికారులు చెబుతున్నారు. అదే భవనంలో అంతే విస్తీర్ణం కలిగిన దుకాణాలకు ఒక్కొక్కరు సగటున నెలకు రూ.80 వేలు కడుతుంటే...రింగ్ అయినవారు రూ.14 వేలకు దక్కించుకోవడంతో విషయాన్ని చైర్మన్ ప్రణవ్ గోపాల్ దృష్టికి తీసుకువెళ్లారు. సంస్థకు ఆ ఒక్క దుకాణం వల్లే నెలకు రూ.70 వేలు నష్టం వస్తున్నట్టు గమనించి, ఆయన అధికారులను పిలిచి మాట్లాడగా తప్పు జరిగినట్టు అంగీకరించారు. ఆ దుకాణం కేటాయింపును పెండింగ్‌లో పెట్టి మళ్లీ వేలం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ ఫిర్యాదు వచ్చింది కాబట్టి విషయం బయట పడిందని, ఇలా ఇంకెన్ని ఉన్నాయో చూడాలని ఆయన ఆదేశించడంతో అధికారులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. ఇలాంటివి నివారించడానికి వేలం పెట్టకుండా నిర్ణీత ధర పెట్టి లాటరీ ద్వారా కేటాయిస్తే అక్రమాలకు అవకాశం ఉండదని వ్యాపారులు సూచిస్తున్నారు. అధికారులు దీనిపై పునరాలోచన చేయాల్సి ఉంది.

# ట్రిపుల్ ఐటీలో 866 మందికి ప్రవేశాలు



ఎచ్చెర్ల, (సందేశం టైమ్స్),జులై 4: రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ) పరిధిలోని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో 2025-26 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లకు నూజివీడు క్యాంపస్‌లో నిర్వహించిన తొలివిడత ప్రక్రియ ముగిసింది. శ్రీకాకుళం క్యాంపస్‌లో ప్రవేశాలకు నూజివీడులో బుధ, గురువారాల్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ డాక్టర్ సండ్ర అమరేంద్రకుమార్, డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ చేపట్టారు. గురువారం 547 మంది విద్యార్థులను కౌన్సెలింగ్‌కు పిలవగా 429 మంది హాజరయ్యారు. ఇందులో 116 మంది బాలురు, 313 మంది బాలికలు ఉన్నారు. తొలిరోజు బుధవారం 517 మందికిగానూ 437 మంది హాజరైన విషయం తెలిసిందే. మొత్తంగా 1,064 మందిని కౌన్సెలింగ్‌కు పిలవగా 866 మంది ప్రవేశాలు పొందారు. వీరిలో బాలురు 243 మంది, బాలికలు 623 మంది ఉన్నారు. తొలి విడతలో మిగిలిన 234 సీట్లను మెరిట్ జాబితా ప్రకారం రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించి భర్తీ చేస్తామని ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఈ నెల 14 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు.

# సచివాలయం తెరిచేదెప్పుడు?




పత్తికొండ (సందేశం టైమ్స్)జులై 4: : మండలంలోని చిన్నహుల్తి గ్రామ సచివాలయం గురువారం ఉదయం 11:30 గంటలు దాటినా తెరుచుకోలేదు. చిన్నహుల్తి, పెద్దహుల్తి గ్రామాలు ఈ సచివాల యం పరిధిలో ఉన్నాయి. వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, వేల్ఫేర్, కంప్యూటర్ ఆపరేటర్, ఇంజనీర్, అగ్రికల్చర్, వెటర్నరీ, మహిళా పోలీస్, ఏఎన్ఎంలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్కరూ రాకపోవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు నిరాశతో వెను దిరిగారు. అనంతరం ఓ ఉద్యోగి మాత్ర మే రావడంతో ప్రజలు ప్రశ్నిస్తు న్నారు. ఈ విషయమై పత్తికొండ ఎంపీడీవో కవితను వివరణ కోరగా విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు

# నకిలీ ఎరువుల దందా



ఆదోని (సందేశం టైమ్స్)జులై 4: : ఖరీఫ్ వచ్చిందంటే చాలు ఎరువుల దుకాణదారుల దందా మొదలవుతుంది. ఎరువుల వ్యాపారుల వ్యవహారంలోని మతలబు ఎవరికీ అంతు చిక్కదు. వ్యవసాయ శాఖ నిబంధనల ప్రకారం ఎరువులను పక్క రాష్ట్రం నుండి మరో రాష్ట్రానికి తరలించకూడదు. అలాంటిది ఎలాంటి ఇన్వాయిస్ లేకుండా ఏకంగా కర్ణాటక నుంచి నకిలీ ఎరువులను తెచ్చి రైతులకు అంటగడుతున్నారు. నిబంధనల ప్రకారం అధికారులు తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలి. కానీ అధికారులు కార్యాలయాలకు పరిమితం కావడంతోపాటు ఎరువుల దుకాణదారులతో సత్సంబంధాలతో ముందుకు పోతున్నారు. దీంతో రైతులే ఎరువులు ఏవి నకిలీవి, ఏవి మంచివని గుర్తుపట్టి ఎరువుల యజమానులకు ఫోన్ చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. అందులో భాగంగానే ఆదోని మండలం పెద్ద తుంబళం నబీ ట్రేడర్స్ ఎరువుల దుకాణదారులు స్పైస్ కంపెనీకి చెందిన డీఏపీని ఒక ప్యాకెట్ రూ.1350లకు విక్రయించారు.వందల ఎరువుల ప్యాకెట్లను రైతులకు అంటగట్టారు. అయితే పంటలకు పిచికారీ చేసే క్రమంలో యూరియాలో సంబంధిత స్పైస్ డీఏపీని కలపగా, ఒక్కసారిగా డీఏపీ మొత్తం నీటి నీరైంది. రైతులు ఈ డీఏపీ నకిలీదని స్పైస్ కంపెనీ ఉద్యోగులను నిలదీశారు. తాము ఏ డీలర్‌కు స్పైస్ డీఏపీ పంపిణీ చేయలేదని, ఎవరి వద్ద కొనుగోలు చేశారని తెలుసుకొని కంపెనీ ఉద్యోగులు గురువారం నబీ ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసి వారి గోడౌన్లలో ఉన్న స్పైస్ డీఏపీ ప్యాకెట్ల మొత్తం నకిలీవని గుర్తించారు. కంపెనీ యజమానులకు ఫిర్యాదు చేశారు. దీంతో దుకాణదారుడు ఇలియాస్ తక్షణమే దుకాణంలో ఉన్న నకిలీ ఎరువులను ఆటోల్లో తన ఇంటికి తరలించాడు. వ్యవసాయ అధికారి సుధాకర్ సిబ్బందితో ్కాణానికి చేరుకొని స్పైస్ డీఏపీ ఎరువులు కర్ణాటక నుంచి దిగుమతి అయ్యాయని గుర్తించారు. వీటికి అనుమ తులు లేవని గుర్తించి 100 డీఏపీ సంచులను సీజ్ చేశారు. నకిలీ ఎరువుల దందాపై విజిలెన్స్ అధికారులపై విచారణ చేపట్టినట్లు సమాచారం.

# కోడూరుకు పారిశ్రామిక శోభ

అనకాపల్లి (సందేశం టైమ్స్)జులై 4: జిల్లాలో చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా అనకాపల్లి మండలం కోడూరులో పారిశ్రామిక పార్కు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇక్కడ చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటు కోసం ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి 350కిపైగా దరఖాస్తులు అందగా, వాటిని కలెక్టర్ విజయకృష్ణన్ ఆధ్వర్యంలో పరిశీలించిన ఏపీఐఐసీ అధికారులు ఇప్పటికే అన్ని అర్హతలు కలిగిన 171 మందికి స్థలాల కేటాయింపులు జరుపుతున్నారు. ఈ పార్కులో అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్




ఇండియా సంస్థకు స్థలాన్ని కేటాయించ నున్నారు. ప్రతి యూనిట్‌కు 300 చదరపు మీటర్ల విస్తీర్ణం చొప్పున ఇప్పటికే 250 ప్లాట్‌లను సిద్ధం చేశారు. వీటిలో 45 ఎస్సీలకు, 17 ఎస్టీ తెగలకు కేటాయిం చనున్నారు. మిగిలినవి ఓపెన్ కేటగిరీలో కేటాయింపులు జరుపుతున్నారు. చదరపు మీటరు రూ.5,090 ధరకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

# మా భూములకు దారేదీ?

**'పలాస - ఇచ్ఛాపురం' మూడో రైల్వేలైన్‌కు కసరత్తు**
**రైల్వేట్రాక్‌కు ఇరువైపులా స్తంభాలు**
**వంతెనలు, ఖానాలు ఉన్నచోట సైతం ఏర్పాటు**
**పొలాలకు వెళ్లేందుకు అడ్డంకులు**
**ఆందోళనలో 100 గ్రామాల రైతులు**



హరిపురం,(సందేశం టైమ్స్),జులై 4: :మందస మండలం హరిపురం గ్రామానికి చెందిన రైతులకు బాలిగాం, భిన్నలమదనాపురం పంచాయతీల పరిధిలో భూములు ఉన్నాయి. ఆ భూములకు వెళ్లాలంటే రైల్వేట్రాక్ దాటాల్సి వస్తోంది. మధ్యలో చిన్నచిన్న ఖానాలు, గెడ్డ నీరు ప్రవహించే కాలువలు ఉన్నాయి. వాటి గుండా పొలాలకు వెళ్తుండేవారు. ప్రస్తుతం రైల్వేట్రాక్ ఇరువైపులా రైల్వేశాఖ స్తంభాలు పాతి దారి మూసివేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు............సోంపేట మండలం తాళ్లభద్ర గ్రామ రైతులకు అంబుగాం రెవెన్యూ పరిధిలోని భిన్నల మదనాపురంలో భూములు ఉన్నాయి. మధ్యలో ఉన్న రైల్వేట్రాక్ దాటితే కానీ తమ పొలాలకు రైతులు వెళ్లలేరు. వ్యవసాయ పనులు చేసుకోవడానికి, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు తప్పనిసరిగా రైల్వేలైన్ దాటాల్సిందే. ప్రస్తుతం రెండు వైపులా స్తంభాలతో కప్పేస్తుండడంతో రాకపోకలు ఎలా సాగించాలని రైతులు మదనపడుతున్నారు.

.................ఈ రెండు గ్రామాలే కాదు. పలాస నుంచి ఇచ్ఛాపురం వరకూ ఉన్న 45 కిలోమీటర్ల పరిధిలో దాదాపు 100 గ్రామాల వరకూ ఇదే పరిస్థితి. పంచాయతీలు, రెవెన్యూ భూములను విభజిస్తూ రైల్వేట్రాక్ ఉండేది. రైతులకు సాగునీరుకు సంబంధించి కాలువలపై భారీ వంతెనలు, కల్వర్టులు, ఖానాలను రైల్వేశాఖ ఏర్పాటు చేసింది. దశాబ్దాలుగా రైతులు వాటిపై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం పలాస నుంచి ఇచ్ఛాపురం వరకూ మూడో రైల్వేలైన్ పనుల కసరత్తు జరుగుతోంది. అందులో భాగంగా జంగిల్ క్లియరెన్స్ చేపడుతున్నారు. రైల్వేభూముల పరిధిని నిర్దేశిస్తూ శాశ్వత స్తంభాలను ఏర్పాటు చేసి కంచె వేస్తున్నారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేట్రాక్ దాటేందుకు వీలులేకుండా ఎక్కడికక్కడే స్తంభాలు ఏర్పాటు చేస్తుండడంతో పొలాలకు ఎలా రాకపోకలు సాగించాలో తెలియక సతమతమవుతున్నారు.

**అప్పుడు హైవే.. ఇప్పుడు రైల్వే..**

విశాఖ నుంచి భువనేశ్వర్ వరకూ మూడో రైల్వేలైన్ నిర్మాణానికి రైల్వేశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మార్గంలో వస్తు రవాణా అధికం. విశాఖ స్టీల్‌ప్లాంట్‌తోపాటు ఇతర పరిశ్రమల నుంచి పెద్ద ఎత్తున ముడిసరుకులు, పారిశ్రామిక ఉత్పత్తులు ఈ మార్గంలో తరలిస్తుంటారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి సైతం పెద్ద ఎత్తున పారిశ్రామిక ఉత్పత్తులు ఈ మార్గంలోనే ఎక్కువగా రవాణా జరుగుతోంది. ఈ తరుణంలో సూపర్‌ఫాస్ట్ రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. పైగా రైలు ప్రమాదాలు, సాంకేతిక సమస్యలు, వాతావరణ ప్రతికూల పరిస్థితులు తలెత్తినప్పుడు రెండు లైన్లతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అందుకే మూడోలైన్ ప్రతిపాదన తెచ్చారు. గూడ్స్ రైళ్లకు ప్రత్యేక మార్గం ఉంచి.. మిగతా సూపర్‌ఫాస్టు రైళ్లకు మార్గం సుగమం చేయనున్నారు. ఈ మార్గంలో రైల్వేకు చెందిన భూములే ఉండడంతో వాటిలో ఇప్పుడు జంగిల్ క్లియరెన్స్ పనులు చేస్తున్నారు. అందులో భాగంగానే విద్యుత్ స్తంభాలతో మూసివేస్తున్నారు.

# మొరాయించిన సర్వర్

రేషన్ సరకుల కోసం జనం పడిగాపులు
మూడు రోజులుగా వేధిస్తున్న సమస్య
ఒక్కో కార్డుకు పది నిమిషాలకు పైగా సమయం
ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు
డీలర్లతో కార్డుదారుల వాగ్వాదం



విశాఖపట్నం,(సందేశం టైమ్స్)జులై 4: : సర్వర్ తరచూ మొరాయిస్తుండడంతో రేషన్ బియ్యం పంపిణీకి సమస్యలు ఎదురవుతున్నాయి. కార్డుదారులు గంటల తరబడి దుకాణాల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో పలువురు...డీలర్లతో వాగ్వాదానికి దిగుతున్నారు. జిల్లాలో ఈనెల ఒకటో తేదీన కార్డుదారులకు సరకుల పంపిణీ ప్రారంభమైంది. ఉదయం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు, రాత్రి ఎనిమిది తరువాత సర్వర్ వేగంగా పనిచేస్తోంది. మిగిలిన సమయంలో ఒక్కో కార్డుకు సుమారు పది నిమిషాలకు పైగా సమయం పడుతోంది. సరకులకు వచ్చే కార్డుదారుడు రేషన్ డిపోలోని ఈ పోస్ యంత్రంలో వేలిముద్ర వేసిన పది నిమిషాల తరువాత వివరాలు అప్‌లోడ్ అవుతున్నాయి.

**ఆది నుంచి కష్టాలు**

సరకుల పంపిణీ ప్రారంభించిన మొదటి రోజు నుంచీ సర్వర్ కష్టాలు కొనసాగుతున్నాయి.సమస్య మరింత జఠిలమై కార్డుదారుల సహనానికి పరీక్ష పెట్టింది. ఈ నేపథ్యంలో కార్డుదారులు రేషన్ డీలర్లతో వాగ్వాదానికి దిగుతున్నారు. 20 కిలోల బియ్యం కోసం డిపో ఎదుట గంటల సమయం వేచి ఉండాల్సి వస్తోందని గొడవకు దిగుతున్నారు. సర్వర్ పనిచేయకపోతే తామేమీ చేయలేమని, విషయాన్ని పౌర సరఫరాల శాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని డీలర్లు చెబుతున్నారు. ఆరిలోవ, రామ్‌నగర్, అక్కయ్యపాలెం, శంకరమఠం, సీతంపేట తదితర డిపోల ఎదుట గురువారం కార్డుదారులు గంటల సమయం నిరీక్షించారు. ఈ ఏడాది మే వరకు వాహనాలను వీధుల్లోకి తీసుకువచ్చి సరకులు పంపిణీ చేసేవారని, వాటిని రద్దు చేసి, డిపోలకు అప్పగించడంతో వీలున్నప్పుడు సరకులు తీసుకోవచ్చునని సంబరపడ్డామని, తీరా సర్వర్ మొరాయింపుతో రోజుల తరబడి తిరగాల్సి వస్తోందని అక్కయ్యపాలెం పరిధిలోని ఓ డిపో వద్దకు సరకుల కోసం వచ్చిన సరస్వతి వాపోయారు. రోజుకు 50 నుంచి 60 మందికే సరకులు అందుతున్నాయన్నారు. సర్వర్ సమస్యను సత్వరం పరిష్కరించాలని జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు పి. చిట్టిరాజు అధికారులను కోరారు. దీనిపై జిల్లా పౌర సరఫరాల అధికారి వి.భాస్కర్ వద్ద ప్రస్తావించగా సర్వర్ నెమ్మదిగా పనిచేస్తోందని, ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. జిల్లాలోని 5.24 లక్షల కార్డులకుగాను మూడు రోజుల్లో 2,02,710 మందికి సరకులు పంపిణీ చేశామన్నారు.

# ఆరోగ్యకేంద్రం నిర్మాణం అంతేనా..?



దువ్వూరు, (సందేశం టైమ్స్)జులై 4: : గత వైసీపీ హయాంలో అడ్డగోలు నిర్ణయాలతో అభివృద్ధి పడకేసింది. అరకొర నిధులు అభివృద్ధి పనులకు కేటాయించడంతో పెద్దగా ఒరిగిందేమీ లేదు. ఆ తప్పిదాలను కూటమి ప్రభుత్వం సరిచేసుకుంటూ అభివృద్ధి పనులను గాడిన పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇందుకు నిదర్శనంగా దువ్వూరు మండలంలోని చింతకుంట వద్ద రూ.2.50 కోట్లతో చేపట్టిన ప్రభుత్వ ఆరోగ్య కేంద్ర భవనం ఇప్పటికీ పూర్తికాకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడంలేదు. అసలు ఈ భవనాన్ని ఎప్పుడు పూర్తి చేస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ చొరవ తీసుకోవాలని ఈ ప్రాంతవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనుగుణంగా చింతకుంట వద్ద మరో ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించ తలపెట్టారు. ఇందుకొరకు రూ.2.50 కోట్ల నిధులు కేటాయించి పనులు మొదలు పెట్టారు. పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దాదాపు 40 శాతం పనులు జరిగినట్లు తెలుస్తోంది. దీని నిర్మాణం పూర్తయితే ఇక్కడ ప్రధాన వైద్యుల ఏర్పాటుతోపాటు ఎనిమిది మంది ఇతర సిబ్బందిని నియమించి పూర్తిస్థాయి సేవలు అందించే ఏర్పాటు జరిగే అవకాశం ఉంది. తద్వారా చింతకుంట, మీర్జఖాన్‌పల్లె, రామాపురం, సి.బయనపల్లె, బుక్కాయపల్లె, జడ్డికొట్టాలు, హుస్సేనయ్య దర్గా, బీమునిపాడు, అన్నపుశాస్త్రులపల్లి తదితర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. దాదాపు పది నెలలుగా ఈ పనులు నిలిచిపోవడం ఈ ప్రాంతవాసులను కలచివేస్తోంది. ఆర్‌అండ్‌బీ శాఖ నిధులతో చేపట్టిన ఈ పనులను పూర్తి చేసి ఆస్పత్రి నిర్మాణం జరుపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**భవన నిర్మాణం పూర్తికి చొరవ తీసుకుంటాం**

చింతకుంట వైద్య ఆరోగ్య శాఖ భవనం పూర్తి చేయించేందుకు చొరవ తీసుకుంటాం. చేసిన పనులకు బిల్లులు ఇవ్వలేదనే కారణంతో కాంట్రాక్టర్ మిగతా పనులు పూర్తి చేయలేదు. మా శాఖ ఉన్నతాధికారులు పనులను పూర్తి చేయించాలని సూచించారు. పది రోజుల్లో తిరిగి మిగతా పనులు మొదలు పెట్టి వాటిని పూర్తి చేయిస్తాం.

# బయోగ్యాస్, విండ్‌మిల్ కోసం స్థల పరిశీలన



ముద్దనూరు,(సందేశం టైమ్స్)జులై 4: :మండలంలో బయోగ్యాస్, విండ్‌మిల్ ఏర్పాటు కోసం ఆర్డీవో సాయిశ్రీ స్థల పరిశీలన చేశారు. యామవరం గ్రామ సమీపంలో రిలయన్స్ బయోగ్యాస్, బొందలకుంట గ్రామ సమీపంలో ఎకోరిన్ కంపెనీ ఆధ్వర్యంలో చేపట్టే గాలిమరల విద్యుత్ కోసం స్థలాన్ని పరిశీలించారు. తరువాత జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. వంట గది, భోజనాలను పరిశీలించి ,బెంచీల పై నే విద్యార్థులకు భోజన వసతి కల్పించాలన్నారు. విద్యార్థినుల మరుగు దొడ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు అలీఖాన్, డీటీ వరదరకిశోర్‌రెడ్డి ,రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇలాగైతే నీరెలా?

హిరమండలం(సందేశం టైమ్స్)జులై 4: వంశధార ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు ఈ ఏడాదైనా సక్రమంగా సాగునీరు అందుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం హిరమండలంలోని గొట్టాబ్యారేజీ వద్ద వంశధార ఎడమ ప్రధాన కాలువ ద్వారా కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్, ఎమ్మెల్యేలు మామిడి గోవిందరావు, బగ్గు రమణమూర్తి సాగునీటిని విడుదల చేశారు. శివారు భూములకు సైతం సాగునీరు అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. కానీ, కాలువలు కనీస నిర్వహణ లేక.. శివారు భూములకు సాగునీరందే పరిస్థితి కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు.జిల్లాలో వంశధార ప్రాజెక్టు ఎడమ కాలువ 104 కి.మీ. మేర విస్తరించి ఉంది. హిరమండలం, సారవకోట, జలుమూరు, పోలాకి, నరసన్నపేట, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, టెక్కలి, నందిగాం, వజ్రపుకొత్తూరు, మెళియాపుట్టి, పలాస మండలాల్లో 398 గ్రామాల్లో 1,48,200 ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. కొన్నేళ్లుగా వంశధార ఎడమ, కుడి ప్రధాన కాలువల పరిస్థితి దయనీయంగా మారుతోంది. ఏటా నీటి ప్రవాహ సామర్థ్యం తగ్గుతూ ఎక్కడో ఒకచోట గండ్లు పడుతున్నాయి. ఎడమ కాలువ ద్వారా 2,480 క్యూసెక్కుల నీటి విడుదల సామర్థ్యం కాగా, 1,800 క్యూసెక్కులకు మించి నీటిని సరఫరా చేయలేకపోతున్నారు. దీంతో శివారు భూములకు సాగునీరు అందడం లేదు. నీటి విడుదల సామర్థ్యం పెంచితే కాలువ గట్లు కొట్టుకుపోయే పరిస్థితి ఏర్పడుతోంది. 1971–78 మధ్య నిర్మించిన కాలువలు లైనింగ్ లేక చాలావరకు పూడుకుపోయాయి. కొన్నిచోట్ల అండర్‌టన్నెల్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయి. షట్టర్లు, గేట్లు, రెగ్యులేటర్లు మరమ్మతులకు గురయ్యాయి. సుమారు 150 రాతి కట్టడాలు శిథిలావస్థలో ఉన్నాయి. వైసీపీ హయాంలో రెండేళ్ల కిందట ఆధునికీకరణ కోసం రూ.850 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.




దయనీయంగా వంశధార కాలువలు
కనీస నిర్వహణ లేక ఇబ్బందులు
ఆందోళనలో ఆయకట్టు రైతులు

# సంపాదకీయం

## మహెూజ్వలశక్తి అల్లూరి

విప్లవం పేరు చెబితే ఠక్కున గుర్తొచ్చే పేరు.. అల్లూరి సీతారామరాజు. ఆయన విప్లవ వీరుడు, తెలుగు జాతి ముద్దు బిడ్డ. బ్రిటిషర్లను డగడలాడించి, వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన వీరపుత్రుడు. అల్లూరి పేరు చెబితే మన్యం పులకిస్తుంది. ఉప్పొంగే ఆవేశానికి ప్రతీక అల్లూరి. తెల్లవాడి కబంధ హస్తాల్లో భరతమాత కన్నీరు పెడుతున్న రోజులు అవి. ఉత్తర భారతంలో స్వాతంత్ర్యోదమం ఉవ్వెత్తున ఎగసి పడుతున్న రోజులు కూడా. అలాంటి సమయంలోనే పశ్చిమ గోదావరి జిల్లా అడవుల్లో ఓ అగ్నికణం పుట్టింది. ఆ అగ్ని కణమే దావానలంలా వ్యాపించి బ్రిటిష్ సామ్రాజ్యపు గుండెల్లో వణుకు పుట్టింది. అలా తెల్లవాళ్ల పెత్తనం మీద గర్జించిన తెలుగు తేజమే అల్లూరి సీతారామరాజు. నేడు ఆ విప్లవ వీరుని 128వ జయంతి. ఈ సందర్భంగా ఆయన త్యాగాలను ఒక్కసారి గుర్తు చేసుకుందాం.భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో తెల్లదొరలకు సింహస్వప్నంగా నిలిచిన పోరాట యోధుల్లో అల్లూరి సీతారామరాజు ఒకరు. స్వాతంత్ర్యం పొందటానికి సాయుధ పోరాటం ఒక్కటే మార్గమని నమ్మిన అల్లూరి.. తన పోరాట పటిమతో బ్రిటిష్ సైన్యాన్ని వణికించాడు. మన్యం ప్రాంతంలో గిరిజనులను సమీకరించి బ్రిటిష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేశాడు. కొన్నేళ్లపాటు సమరశీల ఉద్యమాలకు అల్లూరి సీతారామరాజు నాయకత్వం వహించాడు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం సిద్ధిస్తుందని నమ్మి, స్వరాజ్యం కోసం తన ప్రాణాలర్పించిన యోధుడు అల్లూరి. నిరక్షరాస్యులు, నిరుపేదలు, అమాయకులైన తన అనుచరులతో, చాలా పరిమిత వనరులతో కేవలం 27 ఏళ్ల వయసులోనే బ్రిటిషు సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీకొన్నాడు. అడవుల్లోని ప్రకృతి సంపదలను అనుభవించే హక్కు గిరిజనులదేనని ఎలుగెత్తి చాటాడు అల్లూరి. ఆయన పోరాట పటిమ, విప్లవ కార్యాచరణ అనితర సాధ్యం. పోడు వ్యవసాయానికి పన్ను కట్టనక్కర్లేదన్నాడు. గిరిజనులను నిలువు దోపిడీ చేస్తున్న దళారుల మీద, వారికి అండగా ఉన్న బ్రిటిషువారి మీద అల్లూరి తన విల్లును ఎక్కుపెట్టాడు. ప్రతి గిరిజనుడినీ ఒక గెరిల్లా యోధునిగా మార్చి తెలుగు నేలకు స్వతంత్ర్య పోరాట మార్గం చూపాడు.సమాచారం ఇచ్చి మరీ పోలీసు స్టేషన్లపై దాడులు చేశాడు. అయితే అదే ఏడాది అల్లూరి సీతారామరాజు విప్లవ దళానికి మొదటి ఎదురుదెబ్బ తగిలింది. 1922 డిసెంబరు 6న జరిగిన పోరులో 12 మంది అనుచరులను సీతారామరాజు కోల్పోయాడు. ఆ తర్వాత ఆయన కొన్నాళ్లు ఎలాంటి పోరాటాలు జరపలేదు. ఆ సమయంలో అల్లూరి మరణించాడనే వదంతులు కూడా వ్యాపించాయి. అయితే ఆయన 1923 ఏప్రిల్‌లో మళ్లీ ప్రత్యక్షమయ్యాడు. మరోసారి తెల్లవాళ్లపై దాడులకు దిగాడు. అల్లూరికి సాయం చేస్తున్నారన్న కోపంతో మన్యం ప్రజలను బ్రిటిషర్లు వేధించడం మొదలు పెట్టారు. తనకున్న అవకాశాలతో పూర్తి స్థాయిలో మన్యం ప్రజలకు రక్షణ కల్పించలేనని తెలిసి తెల్లదొరలకు రామరాజు లొంగిపోవాలనుకున్నాడు. తాను స్నానానికి చెరువు దగ్గరకు రాబోతున్నట్టుగా తన అనుచరుల ద్వారా బ్రిటీష్ అధికారులకు సమాచారం అదించాడు. 1924 మే 7న ఏటి ఒడ్డున స్నానం చేస్తుండగా అల్లూరిని బంధించిన పోలీసులు, ఎటువంటి విచారణ చేపట్టకుండానే అదే రోజున ఆయన్ను కాల్చిచంపారు. బ్రిటిష్ అధికారులు ఓ నాయకుడిని చంపగలిగారు కానీ ఆయన ప్రజల్లో రగిలించిన స్వతంత్ర్య ఆకాంక్షను మాత్రం ఆర్పివేయలేకపోయారు. తెలుగుతేజం అల్లూరి మరణం లేని ఓ విప్లవ వీరుడు. తెలుగు జాతికి, దేశానికి స్ఫూర్తి ప్రధాత. అడవి బిడ్డలకు ఆరాధ్య దైవం సీతారామరాజు అంటే వ్యక్తి కాదు సమూహ శక్తి. సంగ్రామ భేరి. స్వాతంత్ర్య నినాదం. సమరగీతం. ఓ ఉద్యమ జ్వాల. తెలుగు నేల మీద స్వాతంత్ర్య సమరానికి బీజాలు వేసిన మహా నాయకుడు అల్లూరి జయంతి సందర్భంగా ఆ వీరునికి మరోసారి ఘన నివాళి అర్పిద్దాం.

# వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు



చల్లపల్లి (కృష్ణా)(సందేశం టైమ్స్)జులై 4: : వంగవీటి మోహన రంగా జయంతి వేడుకలు కూటమి నేతల ఆధ్వర్యంలో చల్లపల్లిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పడమర వీధిలో వంగవీటి మోహన రంగా విగ్రహానికి ఘంటసాల మార్కెట్ యార్డ్ చైర్మన్ తోట కనకదుర్గ, కూటమి నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ చల్లపల్లి టౌన్ ప్రెసిడెంట్ బొందలపాటి వీరబాబు, టిడిపి నేత రావి రాజేశ్వరరావు, జనసేన పార్టీ నేతలు అడపా రాంబాబు, మడమల రంజిత్, గంగిశెట్టి రాజేంద్ర, అడపా రవి , లంక ప్రసాద్, యడ్లపల్లి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# కస్తూర్బా వసతి గృహంలో 17మంది బాలికలకు తీవ్ర అస్వస్థత



సోమందేపల్లి (శ్రీసత్యసాయి)(సందేశం టైమ్స్)జులై 4: : కస్తూర్బా వసతి గృహంలో 17మంది బాలికలు అస్వస్థతకు గురైన ఘటన గురవారం రాత్రి జరిగింది. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లిలోని కస్తూర్బా బాలికల వసతి గృహంలోని బాలికలు నిన్న రాత్రి తిన్న ఆహారం కలుషితమవడంతో వాంతులు, విరేచనాలతో బాధపడ్డారు. వారిలో 17 మంది బాలికలు తీవ్ర అస్వస్థతకు గురవడంతో ప్రత్యేక వైద్య బృందం అక్కడికి చేరుకుని వసతి గృహంలోనే చికిత్స అందిస్తోంది.

# అమెరికా డబ్ల్యు.పి.ఎఫ్.జి పోటీల్లో వి.జి.వో రామ్ కుమార్ కి కాంస్యం



–తిరుమల(సందేశం టైమ్స్),జులై 4: : అమెరికా డబ్ల్యు.పి.ఎఫ్.జి పోటీల్లో వి.జి.వో రామ్ కుమార్ కి కాంస్యం దక్కింది. ఈ సందర్భంగా విజేతను టిటిడి ఉన్నతాధికారులు శుక్రవారం అభినందించారు. అమెరికాలోని బర్మింగ్‌హామ్‌లో జరిగిన వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్ సింగిల్స్ టెన్నిస్‌లో 55 సంవత్సరాల వయసు వారికి నిర్వహించిన పోటీలలో టిటిడి విజిలెన్స్ వింగ్ విజివో రామ్ కుమార్ కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. నిన్న జరిగిన పోటిలలో రామ్ కుమార్ విజయం సాధించారు. డబుల్స్ లో ఆయనతో పాటు తిరుమల విజివో సురేంద్రబాబు నాలుగో స్థానంను సాధించారు. సింగిల్ టెన్నిస్ లో కాంస్య పతకం సాధించిన రామ్ కూమార్ ను టిటిడి ఉన్నతాధికారులు అభినందించారు.

# "కార్డన్ అండ్ సెర్చ్" ఆపరేషన్



(శ్రీకాకుళం)(సందేశం టైమ్స్)జులై 4: ప్రజల రక్షణ, భద్రత, నేరాలు, నాటుసారా అక్రమ రవాణ, అక్రమ మద్యం బెల్ట్ షాపుల నిర్వహణ, గంజాయి అమ్మకాలు, చోరీలు నియంత్రణే లక్ష్యంగా జె.ఆర్.పురం పోలీసు స్టేషను పరిధిలోని రణస్థలం మండల కేంద్రంలోని వెంకటేశ్వరా కాలనీలో శుక్రవారం వేకువజామున 5 గంటల నుంచి జె.ఆర్.పురం సిఐ ఎం.అవతారం, ఎస్ఐ ఎస్.చిరంజీవి ఆధ్వర్యంలో సర్కిల్ పోలీసు అధికారులు, సిబ్బంది "కార్డన్ అండ్ సెర్చ్" ఆపరేషన్" నిర్వహించి, ఇండ్లలోను, బహిరంగ ప్రదేశాల్లో ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ జిల్లా ఎస్.పి. కె.వి.మహేశ్వర్ రెడ్డి ఆదేశాలు ప్రకారం జె.ఆర్.పురం పోలీసు స్టేషను పరిధిలోగల వెంకటేశ్వరా కాలనీలో నేరాల నియంత్రణకు 'కార్డన్ అండ్ సెర్చ్' నిర్వహించామన్నారు. గ్రామంలో నివాసం ఉన్న అనుమానిత వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసేందుకు, ప్రజల రక్షణకు భరోసా కల్పించేందుకు జె.ఆర్.పురం సర్కిల్ పరిధిలోని జె.ఆర్.పురం, లావేరు, ఎచ్చెర్ల, జి.సిగడాం ఎస్ఐలు, 30 మంది పోలీసు సిబ్బందితో బృందాలుగా ఏర్పడి గ్రామంలోను, గ్రామ శివార్లలోను సోదాలు నిర్వహించామన్నారు. గ్రామంలో అన్ని ఇండ్లలో ఆకస్మికంగా సోదాలు నిర్వహించి, అపరిచత వ్యక్తుల వివరాలు సేకరించి, వారి వ్రేలి ముద్రలను ఎం.ఎస్.సి.డి. పరికరాలతో తనిఖీలు చేసామన్నారు. అదే విధంగా వారి వద్ద లభించిన వాహనాల రికార్డులను పరిశీలించి, రికార్డులు సక్రమంగాలేని 19 ద్విచక్ర వాహనాలను తదుపరి చర్యల నిమిత్తం జె.ఆర్.పురం పోలీసు స్టేషనుకు తరలించామన్నారు. అనుమానిత వ్యక్తులు పారిపోయేందుకు అవకాశం ఉన్న మార్గాలను ముందుగా గుర్తించి, ఆయా మార్గాలను పోలీసు బలందాలతో ముందుగానే దిగ్బందనం చేసామన్నారు. ప్రజల రక్షణ, భద్రతకు భరోసా కల్పించాలని, ముఖ్యంగా గంజాయి, మద్యం బెల్ట్ షాపులు, చోరీలు నియంత్రించాలనే లక్ష్యంతోనే "కార్డన్ అండ్ సెర్చ్" ఆపరేషన్ ముఖ్య ఉద్దేశమని అన్నారు. రాబోయే రోజుల్లో ఇదే తరహాలో జె.ఆర్.పురం సర్కిల్ పరిధిలో మరికొన్ని ప్రాంతాల్లో "కార్డన్ అండ్ సెర్చ్" ఆపరేషన్స్ ఆకస్మికంగా చేపట్టనున్నామన్నారు. ఈ అపరేషన్లో పాల్గనే పోలీసు అధికారులు, సిబ్బందితో మమేకమై "కార్డన్ అండ్ సెర్చ్" ఉద్దేశ్యాన్ని, ఆపరేషన్ లో అధికారులు, సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులు, తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను వివరించి, ప్రజలెవ్వరితో దురుసుగా వ్యవహరించ వద్దని దిశా నిర్దేశం చేసారు. కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషనులో ఎటువంటి నిషేధిత వస్తువులు, గంజాయి, అక్రమ మద్యం, నాటుసారా వంటివి లభ్యం కాలేదన్నారు. "కార్డన్ అండ్ సెర్చ్" ఆపరేషను తరువాత గ్రామస్థులతో సిఐ అవతారం సమావేశమై, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఉపాధి పొందేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని గ్రామస్థులకు సిఐ సూచించారు. ఈకార్యక్రమంలో జె.ఆర్.పురం సర్కిల్ పరిధిలో ఉన్న ఎస్.ఐ.లు, సిబ్బంది పాల్గొన్నారు.

# హెూంగార్డుకు డిఎస్పి సాయం



ఏలూరు(సందేశం టైమ్స్)జులై 4: సిబ్బంది సంక్షేమం తమ లక్ష్యమని పోలీసు అధికారులు చెబుతూ ఉంటారు ఈ మాటలను తూ.చా తప్పకుండా పాటిస్తూనే ఉంటారు కొందరు పోలీసు అధికారులు. ఈ విధానంలోనే ఏలూరు డిఎస్పి శ్రావణ్ కుమార్ హౌంగార్డ్ యూనిట్ లో హౌమ్ గార్డ్ గా పనిచేస్తున్న పద్మా అనే హౌంగార్డు భర్త గత కొంతకాలంగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడు. సిబ్బంది ద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్న ఆయన శుక్రవారం ఉదయం హౌంగార్డ్ పద్మను పిలిచి ఆమె భర్త చికిత్స అవసరాల నిమిత్తం పదివేల రూపాయలను ఆర్థిక సహాయంగా అందించారు.



# క్రీడావార్తలు



## గెలిపించాల్సింది అతడే.. ఈ లాజిక్ వర్కౌట్ అవుతుందా?




పీడకలగా చెప్పుకునే ఎడ్జ్‌బాస్టన్‌లో తొలి గెలుపును రుచి చూడాలని అనుకుంటోంది టీమిండియా. ఈ దిశగా భారీ అడుగులు పడ్డాయి. ఇక్కడ ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్.. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 587 పరుగుల భారీ స్కోరు చేసింది. కెప్టెన్ గిల్ డబుల్ సెంచరీతో చెలరేగాడు. ఇతర బ్యాటర్లు కూడా రాణించడంతో కొండంత స్కోరు చేసింది మెన్ ఇన్ బ్లూ. అలాగే తర్వాత బ్యాటింగ్ మొదలుపెట్టిన ఆతిథ్య జట్టును తీవ్రంగా ఇబ్బందులు పెట్టింది. తొలి రోజు ముగిసేసరికి 3 వికెట్లకు 77 పరుగులతో ఉంది ఇంగ్లండ్. దీంతో మూడో రోజు ఏం అవుతుంది? మన బౌలర్లు మరింత చెలరేగుతారా? అని అంతా ఆలోచనల్లో పడ్డారు. ముఖ్యంగా ఆ ఒక్కడి మీదే అంతా ఫోకస్ చేస్తున్నారు. ముంచినా.. తేల్చినా అతడే అంటున్నారు. రెండో రోజు సాయంత్రం ఆకాశ్‌దీప్, మహ్మద్ సిరాజ్ అద్భుతంగా బౌలింగ్ చేశారు. ఇద్దరూ కట్టుదిట్టంగా బంతులు వేసి 3 వికెట్లు పడగొట్టారు. మరో పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ బ్రేక్‌త్రూ ఇవ్వలేకపోయాడు. అయితే మూడో రోజు అతడి చుట్టూనే ఆట నడిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. లీడ్స్ టెస్ట్‌లో ప్రసిద్ధ్ వికెట్లు తీసినా భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. అది జట్టుకు బిగ్ మైనస్‌గా మారింది. ఇవాళ కూడా అతడ్నే రూట్, స్టోక్స్, బ్రూక్ లక్ష్యంగా చేసుకొని భారీ షాట్లు ఆడే చాన్సులు ఉన్నాయి.

## కార్ల్‌సన్‌కు గుకేశ్ షాక్




జాగ్రెబ్ (క్రొయేషియా): వరల్డ్ చాంపియన్ గుకేశ్..ప్రపంచ నెంబర్ వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌కు గట్టి షాకిచ్చాడు. గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా జగ్రెబ్ అంచె సూపర్ యునైటెడ్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నీలో గురువారం జరిగిన ఆరో రౌండ్‌లో కార్ల్‌సన్‌ను గుకేశ్ చిత్తు చేశాడు. దాంతో టోర్నీలో ఆరు రౌండ్లు ముగిసేసరికి గుకేశ్ మొత్తం పది పాయింట్లతో అగ్రస్థానానికి దూసుకొచ్చాడు.


## హైహై నాయకా



ఏకంగా నాలుగు సెషన్లపైగానే బ్యాటింగ్.. ఎక్కడా చెదరని ఏకాగ్రత.. షార్ట్‌పిచ్ బంతులనే అస్త్రంగా ప్రయోగిస్తున్నా తొణకలేదు, బెణకలేదు. ఆఫ్‌స్టంప్‌కు ఆవలగా బంతులేసి ఊరిస్తున్నా.. షాట్లను నియంత్రించుకోవడంలో క్రమశిక్షణను ప్రదర్శించాడు. తొలి రోజు జట్టు ఎంతో ఒత్తిడిలో కూరుకుపోయిన సమయంలో ఓర్పు, నేర్పుతో క్రీజులో గోడకట్టిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. రెండో రోజు తన క్లాస్ ఆటకు కొంత మాస్ జోడించి తన శతకాన్ని.. అద్భుత రీతిలో ద్విశతకంగా మార్చాడు. ట్రిపుల్ సెంచరీని కొద్దిలో చేజార్చుకొన్నా.. ఇంగ్లండ్ గడ్డపై అత్యధిక స్కోరు చేసిన భారత కెప్టెన్‌గా నయా రికార్డు సృష్టించాడు. నాయకుడన్న వాడు జట్టు కోసం ముందుండాలి.. ఈ సూత్రాన్ని చిన్నవయసులోనే ఆకళింపు చేసుకొన్న గిల్ జట్టు కోసం ఎదురు నిలిచాడు. వరుసగా రెండు వికెట్లు కోల్పోవడంతో.. ఒక్కసారిగా గందగగోళం తలెత్తినా.. ప్రశాంతంగా పరిస్థితిని చక్కదిద్దాడు. కెప్టెన్‌గా మ్యాచ్‌లో తాను దూకుడుగా ఆడకపోయినా.. మరో ఎండ్‌లోని భాగస్వాములకు సహకరిస్తూ జట్టును గిల్ ఆదుకొన్న తీరు అద్భుతం.

## క్వార్టర్స్‌లో శ్రీకాంత్

న్యూఢిల్లీ: భారత షట్లర్ కిడాంబి శ్రీకాంత్ కాల్గెరీలో జరుగుతున్న కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లాడు. సింగిల్స్ ప్రీక్వార్టర్స్‌లో శ్రీకాంత్ 21-19, 21-12తో వాంగ్ పొ వీ (చైనీస్ తైపీ)ని ఓడించాడు.



## బీసీసీఐకి కేంద్రం నో.. ఇక ఆ సిరీస్ గురించి మర్చిపోవాల్సిందే!




టెస్టులకు గుడ్‌బై చెప్పేసిన దిగ్గజ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీని తిరిగి బ్లూ జెర్సీలో చూసేందుకు అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. త్వరలో బంగ్లాదేశ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో వీళ్లు దుమ్మురేపుతుంటే చూసి ఎంజాయ్ చేయాలని అనుకున్నారు. కానీ ఫ్యాన్స్ ఆశలు నెరవేరేలా కనిపించడం లేదు. ఎందుకంటే ఆగస్టులో జరిగే ఇండో-బంగ్లా సిరీస్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని తెలుస్తోంది. బంగ్లాదేశ్‌లో నెలకొన్న అనిశ్చిత రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఆ దేశంలో పర్యటించడానికి మోదీ సర్కారు నో చెప్పిందని సమాచారం.బంగ్లాతో 3 వన్డేలు, 3 టీ20లు ఆడాల్సి ఉంది భారత్. ఆగస్ట్ 17 నుంచి జరిగే వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తప్పక ఆడతారని అభిమానులు ఎదురు చూస్తున్నారు. అయితే బంగ్లాదేశ్‌లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, స్థానిక సర్కారు సిచ్యువేషన్ ఇబ్బందికరంగా ఉండటంతో అక్కడికి టీమిండియాను పంపేందుకు కేంద్ర ప్రభుత్వం నో చెప్పిందని తెలుస్తోంది. ప్లేయర్ల సేఫ్టీ విషయంలో రాజీ పడబోమని కేంద్రం స్పష్టం చేసిందట. దీంతో ఈ సిరీస్‌లను వాయిదా వేస్తారా? లేదా రద్దు చేస్తారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పాకిస్థాన్‌తో మ్యాచుల మాదిరిగా తటస్థ వేదికల్లో నిర్వహించే దిశగా ఆలోచనలు చేస్తారా అనేది కూడా క్లారిటీ లేదు. భారత్‌తో టీ20, వన్డే సిరీస్‌ల ప్లానింగ్‌లో బిజీగా ఉన్న బంగ్లా బోర్డుకు ఇది గట్టి షాక్ అనే చెప్పాలి. ఈ సిరీస్‌లతో మీడియా హక్కుల అమ్మకాల ద్వారా భారీగా ఆదాయం ఆర్జించాలని బీసీబీ అనుకుంది. అందుకు తగ్గట్లే జులై 10వ తేదీన బిడ్డింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు కూడా చేసింది. అయితే మోదీ సర్కారు పర్మిషన్ ఇవ్వకపోవడంతో బీసీసీఐ ఈ టూర్‌ను వాయిదా వేసే అవకాశాలు కనిపిస్తుండటంతో మీడియా హక్కుల అమ్మకాలను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది బంగ్లా బోర్డు.

## చేతుల్లోకి మ్యాచ్.. అయినా వదలని భయం.. కారణం ఇదే..!




లీడ్స్ టెస్ట్‌లో అనూహ్యంగా ఓటమిపాలైన టీమిండియా.. ఎడ్జ్‌బాస్టన్‌లో మాత్రం అదరగొడుతోంది. తొలి మ్యాచ్ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని కసితో ఉన్న గిల్ సేన.. ఆతిథ్య జట్టును వణికిస్తోంది. మొదట బ్యాటింగ్‌లో రెచ్చిపోయిన మెన్ ఇన్ బ్లూ ఏకంగా 587 పరుగుల భారీ స్కోరు చేసింది. ఆ తర్వాత బౌలింగ్‌లో 25 పరుగులకే ముగ్గురు ఇంగ్లండ్ బ్యాటర్లను వెనక్కి పంపించి మంచి దూకుడు కనబర్చింది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి స్టోక్స్ సేన 77 పరుగులతో ఉంది. క్రీజులో జో రూట్ (18 నాటౌట్), హ్యారీ బ్రూక్ (30 నాటౌట్) ఉన్నారు. అయితే రెండ్రోజుల పాటు ఆటలో ఆధిపత్యం కనబర్చినా టీమిండియా క్యాంపులో భయం పోవడం లేదు. దీనికి కారణం ఏంటో ఇప్పుడు చూద్దాం..రెండో టెస్టులో బ్యాటింగ్‌లో అదరగొట్టిన భారత్.. బౌలింగ్‌లోనూ రెచ్చిపోతోంది. ఇప్పటికే క్రాలే, డకెట్, పోప్ లాంటి ప్రమాదకర బ్యాటర్లను మన బౌలర్లు వెనక్కి పంపించారు. అయినా క్రీజులో ఉన్న రూట్-బ్రూక్ భారత క్యాంపును భయపెడుతున్నారు. ముఖ్యంగా బజ్‌బాల్ గేమ్‌కు బాగా అలవాటు పడిన బ్రూక్ ఎక్కడ తమ మీద విరుచుకుపడతాడోనని టెన్షన్ పడుతున్నారు. రూట్ క్రీజులో పాతుకుపోవడం, స్ట్రైక్ రొటేషన్‌లో ఎక్స్‌పర్ట్. అతడు ఒక ఎండ్ నుంచి స్కోరు బోర్డును కదిలిస్తూ పోతే.. మరోవైపు నుంచి బ్రూక్ అటాక్ చేస్తే భారత్‌కు తీవ్ర ఇబ్బందులు తప్పవు. వీళ్లకు తోడు కెప్టెన్ స్టోక్స్ ఇంకా బ్యాటింగ్‌కు రావాల్సి ఉంది.జేమీ స్మిత్, ఆల్‌రౌండర్ క్రిస్ వోక్స్ కూడా బ్యాట్ ఝుళిపించగల సమర్థులే.

## స్టోక్స్ గాలి తీసేసిన జడేజా.. వీడియో చూస్తే నవ్వాగదు!




ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లో టీమిండియా అదరగొడుతోంది. ఈ పోరులో తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్.. మొదటి ఇన్నింగ్స్‌లో 587 పరుగుల భారీ స్కోరు చేసింది. శుబ్‌మన్ గిల్ (269) కెప్టెన్సీ నాక్‌తో చెలరేగాడు. భారీ ద్విశతకంతో చరిత్ర సృష్టించాడు. అతడితో పాటు ఓపెనర్ యశస్వి జైస్వాల్ (87), ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (89) రాణించారు. గిల్-జడేజా భాగస్వామ్యం భారీ స్కోరుకు బాటలు వేసింది. ఈ జోడీని విడగొట్టేందుకు ప్రత్యర్థి జట్టు ఎన్నో ప్రయత్నాలు చేసి విఫలమైంది. ఆఖరుకు ఆ టీమ్ సారథి బెన్ స్టోక్స్ జడేజాతో మైండ్‌గేమ్స్ ఆడేంత వరకు వెళ్లింది. కావాలనే అలా పరిగెత్తుతున్నావంటూ జడ్డూను స్టోక్స్ టార్గెట్ చేయడం రెండో రోజు ఆటలో చర్చనీయాంశంగా మారింది.భారత ఇన్నింగ్స్ సమయంలో జడేజా వికెట్ల మధ్య పరుగులు తీస్తున్న తీరుపై స్టోక్స్ సీరియస్ అయ్యాడు. భారత బౌలర్లకు వికెట్ నుంచి మద్దతు లభించాలనే ఉద్దేశంతో పిచ్‌పై జడ్డూ పరుగులు తీస్తున్నాడని అన్నాడు. రఫ్ స్పాట్‌లు ఏర్పడేలా స్టంప్స్‌కు దగ్గరగా పరుగులు తీస్తున్నాడంటూ టీమిండియా ఆల్‌రౌండర్‌పై అంపైర్‌కు ఫిర్యాదు చేశాడు. అయితే జడేజా వెనక్కి తగ్గలేదు. నాకేం అవసరం.. నేనెందుకు అలా చేస్తానంటూ ఇంగ్లండ్ సారథికి ఇచ్చిపడేశాడు. గెలుపు కోసం పిచ్చి పనులు చేయాల్సిన అవసరం తనకు లేదన్నాడు.డేంజర్ ఏరియాలో పరిగెత్తాల్సిన అవసరం తనకు లేదని.. ఆ జోన్‌లో తాను బౌలింగ్ చేయనంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించాడు జడేజా. దీంతో స్టోక్స్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తన ఫోకస్ మొత్తం బ్యాటింగ్ మీదే ఉందంటూ స్టోక్స్‌కు ఇచ్చిపడేశాడు. మాటకు మాట సమాధానం చెప్పాడు టీమిండియా ఆల్‌రౌండర్. దీనిపై మ్యాచ్ తర్వాత కూడా క్లారిటీ ఇచ్చాడు జడ్డూ. 'నేను కావాలనే డేంజర్ జోన్‌లో పరిగెత్తుతూ రఫ్ వచ్చేలా చేస్తున్నానని స్టోక్స్ అనుకున్నాడు. అయితే ఇలాంటివి ఫాస్ట్ బౌలర్లు చేస్తుంటారు. దీంతో నాకేం అవసరం? నేను వికెట్ల మధ్య పరుగులు తీస్తున్నానని అతడు పదే పదే అంపైర్లకు చెబుతూ వచ్చాడు. కానీ నాకు చెడు ఉద్దేశం లేదు. అది అనుకోకుండా జరిగి ఉండొచ్చు. కానీ కావాలని చేసిందైతే కాదు' అని జడేజా స్పష్టం చేశాడు. కాగా, స్టోక్స్‌తో వాగ్వాదం తర్వాత అతడి బౌలింగ్‌లో వరుస బౌండరీలతో వణికించాడు జడ్డూ.

# బిజినెస్



## 13 వరకు జోయాలుక్కాస్

హైదరాబాద్: జువెలరీ రిటైలర్ జోయాలుక్కాస్.. ది బిగ్గెస్ట్ జువెలరీ సేల్ ఆఫ్ ది ఇయర్ పేరుతో వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ నెల 13 వరకు ఈ ఆఫర్లు అందుబాటులో ఉండనున్నాయి. ఇందులో భాగంగా ఎంపిక చేసిన ఆభరణాల మజూరీ చార్జీల (వీఏ)పై 50 శాతం తగ్గింపును ఆఫర్ చేస్తున్నట్లు జోయాలుక్కాస్ ప్రకటించింది. ఈ మెగా సేల్‌లో బంగారం, వజ్రాలు (కట్, అన్ కట్), ప్లాటినం, వెండి, ప్రీషియస్ స్టోన్స్‌లోని విస్తృత శ్రేణి డిజైన్లు కస్టమర్ల కోసం అందుబాటులో ఉండనున్నాయి.

## పసిడి ప్రియులకు షాక్..

# మళ్లీ పెరిగిన బంగారం ధరలు..




గత నెలలో 93 వేల రూపాయల దగ్గర ట్రేడ్ అయిన స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర ఇప్పుడు మళ్లీ లక్ష దగ్గరకు చేరుకుంది. 18, 22 క్యారెట్ల బంగారం ధరలు కూడా మళ్లీ షాకులు మీద షాకులు ఇస్తున్నాయి. ప్రతీ రోజూ పెరుగుతూ పోతున్నాయి. ఈ సారి మాత్రం 24 క్యారెట్ల బంగారం లక్ష దాటే అవకాశం కనిపిస్తోంది. హైదరాబాద్ మహా నగరంలో నిన్న 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 91,050 రూపాయల దగ్గర..10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 99,330 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 74,500 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాముల బంగారంపై.. గ్రాముకు ఒక రూపాయి చొప్పున 10 రూపాయలు పెరిగింది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 99,340 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 91,060 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర .. 74,510 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.వెండి ధరలు ఇలా .. బంగారం ధరలతో సంబంధం లేకుండా వెండి ధరలు మొన్నటి వరకు తగ్గుతూ వచ్చాయి. కానీ, ఈ రోజు వెండి ధరలు కూడా అనుకోని షాక్ ఇచ్చాయి. నిన్న హైదరాబాద్ నగరంలో 100 గ్రాముల వెండి ధర 12,100 దగ్గర ట్రేడ్ అయింది. కేజీ వెండి ధర 1,21,000 దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు 100 గ్రాముల వెండిపై 10 రూపాయలు, కేజీ వెండిపై 100 రూపాయలు పెరిగింది. 100 గ్రాముల వెండి ధర నేడు 12,110 దగ్గర ట్రేడ్ అవుతోంది. కేజీ వెండి ధర 1,21,100 దగ్గర ట్రేడ్ అవుతోంది.

## హెల్త్‌కేర్ రంగం కోసం నియంత్రణ మండలి

### ఏర్పాటుకు ప్రభుత్వ ప్రయత్నాలు.. హాస్పిటల్స్ దందాలకు చెక్ పెట్టేందుకే..





న్యూఢిల్లీ: ప్రైవేట్ ఆస్పత్రుల దందాలకు చెక్ పెట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం మార్కెట్ నియంత్రణ మండలి సెబీ, బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి ఐఆర్‌డీఏఐ, టెలికాం నియంత్రణ మండలి ట్రాయ్ తరహాలోనే హెల్త్‌కేర్ రంగం కోసం స్వతంత్రంగా పనిచేసే ఒక రెగ్యులేటరీ సంస్థను ఏర్పాటు చేసేందుకు జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ (జీఐసీ), ఐఆర్‌డీఏఐ.. ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నాయని జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీఎండీ రామస్వామి నారాయణన్ వెల్లడించారు. ఈ రెగ్యులేటరీ సంస్థ అమల్లోకి వస్తే ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్య బీమా ఉన్న పేషెంట్ల నుంచి వసూలు చేసే విచక్షణాపూరిత భారీ బిల్లులకు చెక్ పడుతుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరైనా ఏదైనా అనారోగ్య సమస్యతో హాస్పిటల్‌కు వెళితే, ఆస్పత్రి ఉద్యోగులు అడిగే మొదటి ప్రశ్న 'మీకు ఆరోగ్య బీమా పాలసీ ఉందా? అని.. ఉంది అంటే ఇక వారి పంట పండినట్టే. సమస్య చిన్నదైనా వారి నుంచి నగదు చెల్లింపు రోగి కంటే రెండు మూడు రెట్లు ఎక్కువ బిల్లు చేసి పంపిస్తున్నారని రామస్వామి అన్నారు. అన్ని ఆస్పత్రులు కాకపోయినా, ఎక్కువ ఆస్పత్రుల్లో జరుగుతున్న దందా ఇదే. ఈ క్లెయిమ్‌లు చెల్లించలేక బీమా కంపెనీలు కిందా మీద పడుతున్నాయి. దీంతో ఆ భారాన్ని తట్టుకునేందుకు ప్రీమియం రేట్లు పెంచేసి, ఆ మొత్తాన్ని పాలసీదారుడి నుంచే బీమా కంపెనీలు వసూలు చేస్తున్నాయి. ఇది అటు బీమా కంపెనీలకు, ఇటు పాలసీదారులకు ఇద్దరికీ భారంగానే మారుతోంది. స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేసే హెల్త్‌కేర్ రెగ్యులేటరీ సంస్థను ఏర్పాటు చేయడం ద్వారా ఈ దందాను అడ్డుకోవాలని బీమా సంస్థలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

# ఇళ్ల అమ్మకాలు కిందికి



శంలో ఇళ్ల అమ్మకాలు నేలచూపులు చూస్తున్నాయి. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో 1,70,201 ఇళ్లు, ఫ్లాట్లు అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే... %న్యూఢిల్లీ: దేశంలో ఇళ్ల అమ్మకాలు నేలచూపులు చూస్తున్నాయి. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో 1,70,201 ఇళ్లు, ఫ్లాట్లు అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే అమ్మకాలు 2 శాతం తగ్గాయని రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా గురువారం విడుదల చేసిన ఒక నివేదికలో తెలిపింది. అమ్మకాలు తగ్గినా ఇళ్ల ధరలు మాత్రం సగటున 2 నుంచి 14 శాతం వరకు పెరిగాయి. ఇదే సమయంలో ఈ ఎనిమిది నగరాల్లో కంపెనీలు లీజుకు తీసుకున్న ఆఫీస్ స్పేస్ విస్తీర్ణం 41% పెరిగి 489 లక్షల ఎస్ఎఫ్‌టీ చేరింది.హైదరాబాద్ రియల్టీలో జోరు: గత ఆరు నెలల్లో హైదరాబాద్ రియల్టీలో మాత్రం మంచి వృద్ధి రేటు కనిపించింది. గత ఆరు నెలల్లో నగరం, దాని చుట్టుపక్కల 19,048 ఇళ్లు, ఫ్లాట్లు అమ్ముడు పోయాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 3 శాతం ఎక్కువ. ఇదే సమయంలో ధరలు 11 శాతం వరకు పెరిగాయి. కార్యాలయ భవనాల లీజుల విషయంలోనూ ఇదే పరిస్థితి. గత ఆరు నెలల్లో హైదరాబాద్‌లో 59 లక్షల చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) ఆఫీస్ స్పేస్ లీజుకు సంబంధించి ఒప్పందాలు జరిగాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 16 శాతం ఎక్కువ. ఇదే సమయంలో నెలవారీ ఎస్ఎఫ్‌టీ లీజు రెంటల్స్ సగటున 10 శాతం పెరిగి రూ.75కు చేరాయి.జూన్ ముగిసే నాటికి హైదరాబాద్‌లో అమ్ముడుపోని ఇళ్లు, ఫ్లాట్ల సంఖ్య 54,458గా ఉన్నాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 11 శాతం ఎక్కువ.రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల మధ్య ధర ఉన్న ఇళ్లకు యమ గిరాకీ, రూ.కోటి నుంచి రూ.5 కోట్ల మధ్య ధర ఉన్న లగ్జరీ ఇళ్లకూ గిరాకీ

## మూడంచెల జీ ఎస్ టీ రేట్లు వాంఛనీయం




న్యూఢిల్లీ: దేశంలో సరళమైన మూడంచెల జీఎస్టీ విధానం అమలు చేయాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నూతన అధ్యక్షుడు రాజీవ్ మెమానీ సూచించారు. నిత్యావసర వస్తువులకు 5%, విలాసవంతమైన వస్తువులకు 28% కనిష్ఠ, గరిష్ఠ రేటు, మిగతా వస్తువులన్నింటికీ మధ్యేమార్గంగా 12–18% రేటు ఉండాలన్న అభిప్రాయం ఆయన ప్రకటించారు. ప్రస్తుతం దేశంలో నాలుగంచెల జీఎసటీ విధానం (5, 12, 18, 28 శాతం) అమలులో ఉంది. సీఐఐ అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వస్తు సేవల పన్నును (జీ ఎస్ టీ) హేతుబద్ధం చేయాల్సిన అవసం ఉన్నదని నొక్కి చెప్పారు. ప్రధానంగా అల్పాదాయ వర్గాల ప్రజలు అధికంగా ఉపయోగించే వస్తువులపై పన్ను రేటు తగ్గించాలని ఆయన సూచించారు. అలాగే సిమెంట్ సహా అధిక శాతం ఉత్పత్తులపై ప్రస్తుతం 28% జీఎసటీ అమలులో ఉన్నదని, ఆ రేటును కూడా హేతుబద్ధీకరించడం వల్ల ఆర్థిక కార్యకలాపాలు జోరందుకుంటాయని అన్నారు. పెట్రోలియం, విద్యుత్, రియల్ ఎస్టేట్, ఆల్కహాల్ ఉత్పత్తులను కూడా జీ ఎస్ టీ పరిధిలోకి తెచ్చే విషయంలో జాతీయ స్థాయి ఏకాభిప్రాయ సాధన అవసరమని రాజీవ్ సూచించారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.4 శాతం నుంచి 6.7 శాతం మధ్యలో ఉండవచ్చని భారత రాజీవ్ అంచనా వేశారు.మన దేశ వృద్ధి రేటుకు రిస్కులు, బలాలు కూడా సమతూకంగా ఉన్నాయన్నారు. భౌగోళిక, రాజకీయ అస్థిరతలు వృద్ధిని క్షీణింప చేసే ప్రమాదం ఉన్నప్పటికీ వస్తు, సేవలకు దేశీయ డిమాండు బలంగా ఉండడం వృద్ధిని ఉద్దీపింప చేసే అంశమని ఆయన వివరించారు.


# రిలయన్స్ రిటైల్ గూటికి యూకే కంపెనీ



న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) రిటైల్ అనుబంధ విభాగమైన రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ (ఆర్ఆర్‌వీఎల్) మరో కొనుగోలు జరిపింది. యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)కు చెందిన ఫేషియల్ ఫిట్‌నెస్, స్కిన్‌కేర్ బ్రాండ్ ఫేస్‌జిమ్‌లో మైనారిటీ వాటాను చేజిక్కించుకుంది. అయితే, ఈ ఒప్పందం విలువ మాత్రం వెల్లడించలేదు. ఈ భాగస్వామ్యంలో భాగంగా ఫేస్‌జిమ్ ఉత్పత్తులను భారత మార్కెట్లో ఆర్ఆర్‌వీఎల్ ప్రవేశపెట్టనుంది.

%ఎఫ్ఎంసీజీ వ్యాపారం కోసం కొత్త కంపెనీ ఏర్పాటు: ఆర్ఆర్‌వీఎల్ వ్యాపారాన్ని పునర్వ్యవస్థీకరిస్తోం ది. ఎఫ్ఎంసీజీ బ్రాండ్ల వ్యాపారాన్ని విభజించి 'న్యూ రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్' (న్యూ ఆర్‌సీపీఎల్) పేరిట కొత్త కంపెనీని ఏర్పాటు చేయనుంది. ఇందుకు ఎన్‌సీఎల్‌టీ అనుమతి కోరింది.

# ఆర్బీఐ కొత్త రూల్.. ఈ లోన్స్ తీసుకున్న వారికి ఫైన్స్ నుంచి ఉపశమనం..




వ్యాపారాలకు సౌకర్యవంతమైన రుణ సౌలభ్యం చాలా ముఖ్యమని పేర్కొంది. బ్యాంకులు, %చీదీఖీజ%లు అనుసరిస్తున్న పద్ధతులను తమ పర్యవేక్షణ సమీక్షల్లో గుర్తించినట్లు తెలిపింది. ప్రధానంగా ముందస్తు చెల్లింపు జరిమానాలు రుణగ్రహీతలకు అసౌకర్యాన్ని కలిగించడమే కాక, ఒప్పంద వివాదాలకు కూడా దారితీస్తున్నాయని వెల్లడించింది.ొన్ని బ్యాంకులు, %చీదీఖీజ%లు రుణ ఒప్పందాల్లో పరిమితి కలిగించే నిబంధనలు చేర్చి, రుణ గ్రహీతలకు తక్కువ వడ్డీ రేట్లు లేదా మెరుగైన సేవల కోసం ఇతర రుణదాతల వైపు మళ్లకుండా అడ్డుకుంటున్నాయని ఆర్‌బీఐ బుధవారం రాత్రి జారీ చేసిన నోటిఫికేషన్‌లో తెలిపింది. ఇలాంటి పద్ధతులు రుణ గ్రహీతల ఎంపిక స్వేచ్ఛను, మార్కెట్‌లో ఆరోగ్యకరమైన పోటీని దెబ్బతీస్తాయని హెచ్చరించింది.

ఓవర్ డ్రాఫ్ట్ విషయంలో..ఈ ఆంక్షల నుంచి కొన్ని రకాల రుణదాతలకు మినహాయింపు ఇచ్చారు. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, రీజినల్ రూరల్ బ్యాంకులు, టైర్3 ప్రైమరీ (అర్బన్) కో ఆపరేటివ్ బ్యాంకులు, రాష్ట్ర, కేంద్ర కో-ఆపరేటివ్ బ్యాంకులు, మిడిల్ లేయర్ %చీదీఖీజ%లు ఉన్నాయి. దీంతోపాటు ఇప్పటికే రూ.50 లక్షల వరకు రుణాలపై ముందస్తు చెల్లింపు జరిమానాలు విధించకుండా నిషేధించబడ్డాయి. క్యాష్ క్రెడిట్ లేదా ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యాల విషయంలో రుణ గ్రహీత ఒప్పందంలో నిర్దేశించిన వ్యవధిలో సౌకర్యాన్ని పునరుద్ధరించకూడదని బ్యాంకుకు ముందస్తు సమాచారం ఇస్తే, సౌకర్యం గడువు తేదీన రద్దు అయితే, ముందస్తు చెల్లింపు జరిమానాలు వర్తించవని నోటిఫికేషన్ స్పష్టం చేసింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006